VELTHURU TELUGU DAILAY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
సోమవారం 27.04.2026
సంపుటి: 07 సంచిక: 322
పేజీలు: 12 వెల: రూ. 5/
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH
Velthuru Newspaper



## ఈరోజు డీజిల్, పెట్రోల్ సప్లయ్ పెరగాలి

ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోండి
వరి కోత యంత్రాలకు డీజిల్ కొరత రానివ్వొద్దు
ఆయిల్ కంపెనీలు ఉన్నపళంగా పాలసీలు మార్చి ఇబ్బంది పెడితే ఎలా?
అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

2




## గుట్కా, పాన్ మసాలా, డ్రగ్స్, ఖైనీ వాడకం తో ప్రాణహాని తప్పదు

ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

2



## ఆప్ ఎంపీలపై అనర్హతకు డిమాండ్

రాజ్యసభ ఛైర్మన్‌కు సంజయ్ సింగ్ ఫిర్యాదు
పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద చర్యలకు వినతి
సిద్ధాంతాలు వీడారంటూ బీజేపీ గూటికి చేరిన రాఘవ్ చద్దా బృందం
విలీనం వాదనను తెరపైకి తెచ్చిన తిరుగుబాటు ఎంపీలు

10



# ప్రజావాణి సేవల విస్తరణ

## ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి సీఎం దిశానిర్దేశం

రెవెన్యూ డివిజన్, మండల స్థాయికి విస్తరణకు ఆదేశాలు
ప్రతి ఫిర్యాదు నమోదు, ట్రాకింగ్‌కు డిజిటల్ వ్యవస్థ
నిర్దిష్ట గడువుల్లో పరిష్కారంపై దృష్టి
ఆటో ఎస్కలేషన్, అప్పీల్ వ్యవస్థల ప్రవేశం
జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:

రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని సూచిస్తూ, రెవెన్యూ డివిజన్ స్థాయిలో వెంటనే ప్రారంభించి, తదుపరి దశలో మండల స్థాయికి విస్తరించాలని చెప్పారు. ప్రజలు దూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రాలు, హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అభిప్రాయపడ్డారు.

..మిగతా 2లో



## బీసీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

స్వయం ఉపాధికి తెలంగాణ ప్రభుత్వ బలం
ప్రతి నియోజకవర్గానికి 1000 మందికి 100 శాతం సబ్సిడీ
టైలరింగ్ ద్వారా ఉపాధి, పారిశ్రామిక అవకాశాల విస్తరణ
అమలుపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:

తెలంగాణ రాష్ట్రంలో బలహీన వర్గాలకు చెందిన బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి నియోజకవర్గంలో 1000 మంది మహిళలకు 100 శాతం సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం ద్వారా మహిళలు టైలరింగ్ రంగంలో నైపుణ్యం పెంపొందించుకుని, తమ ఉత్పాదకతను పెంచుకోవడంతో పాటు స్వయం సమృద్ధిగల పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవకాశాలు లభిస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

..మిగతా 2లో



## నేటి నుంచే 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

యూరియా వాడకం తగ్గించాలి.. సన్న రకాల సాగు పెంచాలి
రాష్ట్రవ్యాప్తంగా 200 బృందాలతో అవగాహన సదస్సులు
డిమాండ్ ఉన్న 8 రకాల వరి వంగడాల గుర్తింపు
ఎల్ నినో ముప్పుపై అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి తుమ్మల

2

## అంబేద్కర్ స్మృతి స్థల్ కు 2 గజాల జాగా కూడా కాంగ్రెస్ ఇవ్వలే

చనిపోతే ఢిల్లీలో అంత్యక్రియలు చేయలే
అంబేద్కర్ పార్థివదేహాన్ని తరలిస్తే ఫ్లైట్ ఛార్జీలు చెల్లించాలంటూ బిల్లు పంపిన నీచపార్టీ కాంగ్రెస్
పార్లమెంట్ లో అంబేద్కర్ ఫోటో కూడా పెట్టకుండా అవమానించారు
నెహ్రూ, ఇందిరా వాళ్ల పాలనలోనే భారతరత్న ప్రకటించుకున్నారు
అంబేద్కర్ కు మాత్రం భారతరత్న ఇవ్వకుండా ద్రోహం చేశారు
అంబేద్కర్ ను ఓడించడానికి చేయని కుట్రలు లేవు



10

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తెలివి లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. జీడీపీ ఆధారంగా అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను పెంచాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదనను రాహుల్ గాంధీ అంగీకరించడమే ఇందుకు నిదర్శనమన్నారు.

..మిగతా 2లో

## అమెరికా అధ్యక్షుడిపై హత్యాయత్నం

వైట్ హౌస్ విందులో తూటాల వర్షం
ట్రంప్ సహా పలువురికి తృటిలో తప్పిన ముప్పు
మీడియా వార్షిక విందులో చెలరేగిన హింస
ట్రంప్, జేడీ వాన్స్‌ను సురక్షితంగా తరలింపు
ప్రాణభయంతో టేబుళ్ల కింద దాక్కున్న జర్నలిస్టులు
పోలీసుల అదుపులో కాలిఫోర్నియాకు చెందిన కోల్ థామస్ అలెన్




10



## 2027 జనగణన స్వీయ లెక్కల్లో కిషన్ రెడ్డి

ప్రజలంతా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని కోరిన కేంద్ర మంత్రి
సమ్మిళిత అభివృద్ధిలో జనాభా లెక్కలకు ఉన్న ప్రాముఖ్యతను వివరించిన జీ. కిషన్ రెడ్డి

2



## తెలంగాణలో తొలిసారి జనగణన

తొలి విడతలో అందుబాటులోకి వచ్చిన ప్రత్యేక పోర్టల్
తొలి పౌరుడిగా వివరాలు నమోదు చేసుకున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా
వచ్చే నెల 10 వరకు కొనసాగనున్న సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ
తెలంగాణలో 80 వేల మంది ఎన్యూమరేటర్లతో భారీ కసరత్తు
మే 11 నుంచి జూన్ 9 వరకు నివాస గృహాల జాబితా సేకరణ
ప్రజల సందేహాల నివృత్తి కోసం 1855 నంబర్‌తో ప్రత్యేక హెల్ప్‌లైన్
16 భాషల్లో స్వీయగణన వెసులుబాటు..
సమాచార భద్రతపై అధికారుల భరోసా
జనగణనతో పాటే కులగణన ప్రక్రియ కూడా చేపడుతున్నట్లు వెల్లడి

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా 16 ఏళ్ల విరామం తర్వాత జరుగుతున్న ఈ జనగణనలో భాగంగా తొలి దశలో స్వీయగణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) పద్ధతిని ప్రభుత్వం

..మిగతా 2లో

## గాయపడిన దుశర్ల సత్యనారాయణ శరీరం విధ్వంసానికి గురైన అడవిని తలపిస్తోంది

ప్రకృతి పరిరక్షణకు మారుపేరైన సత్యనారాయణ పై దాడి మనిషి ఉనికి పైనే దాడిగా భావిస్తున్నాం
నల్గొండ జిల్లా ఫ్లోరోసిస్ సమస్య నివారణకు జలసాధన సమితి వ్యవస్థాపకుడిగా ఆయన పోరాట పంథా అసమాన్యమైనది



10

## అనవసర కొనుగోళ్లు వద్దు

ఇంధన కొనుగోళ్లపై సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
ముంబై నుంచి అధికారులతో సీఎం టెలీకాన్ఫరెన్స్
రాష్ట్రవ్యాప్తంగా 421 పెట్రోల్ బంకులు మూత
బంకుల్లో రద్దీ పెరగడంతో నిల్వలు ఖాళీ



10




2

## వికసిత భారత్‌కు ఉత్తేజంగా అణు శాస్త్రవేత్తల కృషి

మన్ కీ బాత్ 133వ ఎపిసోడ్‌లో కీలక వ్యాఖ్యలు
ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ క్రిటికాలిటీ దశకు చేరడం గర్వకారణం
56 గిగావాట్లకు దేశ పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం



## సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్‌గా జి. ముకుంద రెడ్డి బాధ్యతలు

2

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:

సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ గా జీ. ముకుంద రెడ్డి ఆదివారం రోజున బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుత స్పెషల్ కమిషనర్ గా ఉన్న సిహెచ్ ప్రియాంకను బదిలీ చేయడంతో జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ గా ఉన్న ముకుంద రెడ్డిని సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివారం సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ తో పాటు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా కూడా ముకుంద రెడ్డి బాధ్యతలను స్వీకరించారు ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సేవల విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి ఫిర్యాదును తప్పనిసరిగా నమోదు చేసి, సంబంధిత శాఖలకు పంపించి, పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని సీఎం ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్దిష్ట గడువులు ఉండాలని, ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నమోదు, ట్రాకింగ్, పరిష్కారం కోసం ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని సూచించారు. ప్రతి స్థాయిలో ప్రత్యేక నోడల్ అధికారులను నియమించి, అవసరమైతే ఆటో ఎస్కలేషన్ మరియు అప్పీల్ వ్యవస్థలను ప్రవేశపెట్టాలని సీఎం పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేస్తూ, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించడం ద్వారా కింది స్థాయిలోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని, ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# బీసీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

పథకం అమలుపై బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టు తదితర అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. త్వరలోనే దరఖాస్తులను స్వీకరించి, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థికంగా బలపడతారని, భవిష్యత్తులో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలనూ విస్తరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

# గుట్కా, పాన్ మసాలా, డ్రగ్స్, ఖైనీ వాడకం తో ప్రాణహాని తప్పదు

- **ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:

మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటూ అణచివేస్తోందని రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. యువత ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తు దిశగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని రాయదుర్గం సత్వ నాలెడ్జ్ పార్క్‌లో గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నోటి క్యాన్సర్ మరాథాన్‌లో పాల్గొన్న ఆయన, 10కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, యువత యోగా, వ్యాయామం వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని కోరారు.

చెడు అలవాట్ల వల్ల ప్రాణనష్టాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, సమాజంలో అవగాహన పెంపు అత్యవసరమని తెలిపారు. గుట్కా వంటి హానికర అలవాట్లపై చైతన్య కార్యక్రమాలుమరింత విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయని హెచ్చరించి, వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సైబరాబాద్ సీపీ రమేష్ 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. మరో అతిథిగా పాల్గొన్న బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నోటి క్యాన్సర్ కారణంగా దేశంలో లక్షలాది మంది మరణిస్తున్నారని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె. దిలీప్ కుమార్ మాట్లాడుతూ నోటి క్యాన్సర్‌పై అవగాహన పెంపు కోసం ఈ మరాథాన్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తిస్తే చికిత్స సాధ్యమవుతుందని, కాబట్టి ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగ దీపిక, డాక్టర్ సౌమ్య, డాక్టర్ వినూత్న, డాక్టర్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ సాఫ్ట్‌వేర్ సంస్థల ఐటీ ప్రొఫెషనల్స్, డాక్టర్లు, ప్రముఖులు, యువతతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రత్యేకంగా పాల్గొన్నారు.

# నేటి నుంచే 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

- **యూరియా వాడకం తగ్గించాలి.. సన్నరకాల సాగు పెంచాలి**
- **రాష్ట్రవ్యాప్తంగా 200 బృందాలతో అవగాహన సదస్సులు**
- **డిమాండ్ ఉన్న 8 రకాల వరి వంగడాల గుర్తింపు**
- **ఎల్ నినో ముప్పుపై అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి తుమ్మల**



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:

రాష్ట్రంలోని అన్నదాతలకు సాగులో ఆధునిక మెళకువలు నేర్పడమే లక్ష్యంగా ప్రొ. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ నెల 27 నుంచి మే 23 వరకు కొనసాగే ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు, అధికారులు, విద్యార్థులతో కూడిన 200 బృందాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లనున్నాయి. ప్రతి వారం 400 గ్రామాల్లో నేరుగా రైతులతో సమావేశమై.. యూరియా వినియోగం తగ్గింపు, సమతుల్య ఎరువుల వాడకం, పంట మార్పిడి మరియు సేంద్రీయ వ్యవసాయంపై సుమారు 2.45 లక్షల మంది రైతులకు అవగాహన కల్పించనున్నారు.

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాల సాగు ద్వారా రైతులకు అధిక ఆదాయం చేకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు, మిల్లర్లతో చర్చించి రాష్ట్రానికి అనువైన బీపీటీ 5204, తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్ 15048), కేఎన్ఎం 1638, జైశ్రీరాం, హెచ్ఎంటీ, డబ్ల్యూజీఎల్ 962, డబ్ల్యూజీఎల్ 44, టీజీసీ 1798 వంటి ఎనిమిది రకాల సన్న బియ్యం వంగడాలను సాగు చేయాలని మంత్రి సూచించారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి ఈ విత్తనాలను జిల్లాల వారీగా ముందస్తుగా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కేవలం వరికే పరిమితం కాకుండా పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఆయిల్ పామ్ వంటి పంటల వైపు మళ్ళడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులపై స్పందిస్తూ.. ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందకుండా శాస్త్రవేత్తల సూచనల మేరకు నీటి పొదుపు పద్ధతులను పాటించాలని కోరారు. సాగునీటి లభ్యతను బట్టి పంట ప్రణాళికలు రూపొందించుకోవాలని, ప్రభుత్వ యంత్రాంగం ఇచ్చే సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను అధిగమించవచ్చని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు.

# వికసిత భారత్‌కు ఉత్తేజంగా అణు శాస్త్రవేత్తల కృషి

న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 26:

భారతదేశ అణు ఇంధన చరిత్రలో కల్పకం ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్ క్రిటికాలిటీ దశకు చేరుకోవడం ఒక చారిత్రక ఘట్టమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ఆదివారం నిర్వహించిన 133వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, ఈ అసాధారణ విజయం సాధించిన అణు శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ రియాక్టర్ ఏప్రిల్ 6 నుంచి పూర్తిస్థాయిలో తన పనిని ప్రారంభించిందని, ఇది ఇంధన రంగంలో భారత్‌ను స్వయంసమృద్ధి వైపు నడిపిస్తుందని పేర్కొన్నారు. గత మార్చిలో తాను వ్యక్తిగతంగా కల్పకం సందర్శించి రియాక్టర్ లోడింగ్ ప్రక్రియను వీక్షించినప్పుడు కలిగిన అనుభూతిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అణు ఇంధన కార్యక్రమాల వల్ల కేవలం విద్యుత్ ఉత్పత్తి మాత్రమే కాకుండా పారిశ్రామిక, ఆరోగ్య మరియు వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని భరోసా ఇచ్చారు. సైన్స్ మరియు టెక్నాలజీ రంగాల్లో భారత్ సాధిస్తున్న ప్రగతి దేశ నిర్మాణానికి బలమైన పునాది వేస్తోందని, ముఖ్యంగా అంతరిక్ష పరిశోధనల్లో మన శాస్త్రవేత్తల చొరవ అద్భుతమని ప్రధాని ప్రశంసించారు. దేశాభివృద్ధిలో పర్యావరణ హితమైన విద్యుత్ వనరుల ప్రాధాన్యతను వివరిస్తూ, పవన విద్యుత్ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని మోదీ వివరించారు. ప్రస్తుతం దేశ పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 56 గిగావాట్లు దాటడం ఒక విశేషమని, గత ఏడాదిలోనే అదనంగా 6 గిగావాట్ల సామర్థ్యం పెరిగిందని వెల్లడించారు. భవిష్యత్తు అవసరాల కోసం సౌర మరియు పవన శక్తిపై ఆధారపడటం అనివార్యమని, కంటికి కనిపించని ఈ పవన శక్తే దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోందని అభివర్ణించారు. ఇదే క్రమంలో దేశంలో జరుగుతున్న జనగణన 2027 ప్రక్రియపై పౌరుల్లో అవగాహన కల్పించారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, ప్రతి భారతీయుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈ డిజిటల్ జనగణనలో ప్రజలు అందించే సమాచారం అత్యంత సురక్షితంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎన్యూమరేటర్లు ఇళ్లకు రాకముందే సెల్ఫ్ ఎన్యూమరేషన్ పోర్టల్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవచ్చని, దీనివల్ల సమయం ఆదా అవుతుందని సూచించారు. ఇప్పటికే కోటి 20 లక్షలకు పైగా కుటుంబాలు గృహ గణనలో పాల్గొనడం శుభపరిణామమని పేర్కొన్నారు. భారతీయ చేతివృత్తుల కళాకారులను, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో వెదురు ఉత్పత్తుల మీద ఆధారపడి జీవిస్తున్న వారిని ప్రోత్సహించాలని ప్రధాని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కళాత్మకమైన వెదురు ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ఆ రంగంలోని కార్మికుల ఆత్మస్థైర్యాన్ని పెంచవచ్చని, ఇతరులకు బహుమతులు ఇచ్చేటప్పుడు ఇటువంటి స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే అంతర్జాతీయ వేదికలపై భారతీయ ఉత్పత్తుల సత్తాను ప్రస్తావిస్తూ, బ్రెజిల్‌లో జరిగిన అంతర్జాతీయ జున్ను పోటీల్లో రెండు భారతీయ బ్రాండ్‌లు అవార్డులు సాధించడం గర్వకారణమని చెప్పారు. మన దేశ సంప్రదాయ రుచులు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయని, ఇది డైరీ రంగంలో మన ఎదుగుదలకు నిదర్శనమని కొనియాడారు. భారతదేశపు 'వోకల్ ఫర్ లోకల్' నినాదం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరుకుందని, భారతీయ ఉత్పత్తుల నాణ్యత ప్రపంచాన్ని ఆకర్షిస్తోందని ప్రధాని తన ప్రసంగంలో నొక్కి చెప్పారు. బుద్ధపూర్ణిమ పండుగను పురస్కరించుకుని దేశ ప్రజలకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రధాని, గౌతమ బుద్ధుడి శాంతి సందేశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుత కాలంలో ఒత్తిడులు, సవాళ్లు ఎదుర్కొంటున్న మానవత్వానికి బుద్ధుడి బోధనలు సరైన దిశను చూపిస్తాయన్నారు. లడఖ్‌లో జన్మించిన ద్రుబ్‌పోన్ ఓట్జెర్ రిన్‌పోచె అనే వ్యక్తి చిలీ వంటి సుదూర దేశంలో బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేయడం గొప్ప విషయమని మెచ్చుకున్నారు. చిలీలోని కోచిగువాజ్ లోయలో ఆయన బౌద్ధ స్థూపాన్ని నిర్మించారని, అక్కడ ప్రజలకు ధ్యానాన్ని నేర్పిస్తూ భారతీయ సంస్కృతిని చాటుతున్నారని తెలిపారు. కర్ణాటకలోని అటవీ ప్రాంతాల్లో ఉన్న కర్మ బౌద్ధ ఆశ్రమం గురించి కూడా ప్రస్తావిస్తూ, అడవుల పరిరక్షణలో ఆశ్రమం పాత్రను అభినందించారు. శాంతి అనేది మన నుంచే ప్రారంభం కావాలని బుద్ధుడు చెప్పిన మాటను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ఈ విధమైన ఆధ్యాత్మిక, సామాజిక మరియు వైజ్ఞానిక పురోగతితో భారతదేశం విశ్వగురువుగా ఎదుగుతుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో తొలిసారి జనగణన

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన se.census.gov.in పోర్టల్ ఉదయం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర తొలి పౌరుడు, గవర్నర్ శివప్రతాప్ శుక్లా స్వయంగా ఈ పోర్టల్‌లో తన వివరాలను నమోదు చేయడం ద్వారా ఈ చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదేవిధంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుల సమక్షంలో తన వివరాలను ఎంటర్ చేసి సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేసుకున్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దేశంలోనే తెలంగాణను జనగణనలో అగ్రస్థానంలో నిలపాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. స్వీయగణన అనేది ప్రతి ఒక్కరికీ ఒక ఐచ్ఛికం మాత్రమేనని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తమ వివరాలు తామే నమోదు చేసుకునే ఈ విధానం దేశ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. జనగణన ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలంగాణ జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి వెల్లడించారు. నేటి నుంచి ప్రారంభమైన మొదటి దశలో స్వీయ ధ్రువీకరణ కింద మొత్తం 33 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మే 10వ తేదీ వరకు కొనసాగుతుంది. స్వీయగణన ముగిసిన తర్వాత మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యూమరేటర్లు నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటించి హౌస్ లిస్టింగ్ ప్రక్రియ చేపడతారు. ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 వేల మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నివాస గృహాలపై మార్కింగ్ చేయడం, కుటుంబాల వివరాలు సేకరించడం వంటి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రెండో దశ గణన ఉంటుందని, అప్పుడు వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని సమగ్రంగా సేకరిస్తామని డైరెక్టర్ వివరించారు. ఈ మొత్తం ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సమాచార భద్రతకు ఎటువంటి భంగం కలగకుండా నిర్వహిస్తున్నట్లు భరోసా ఇచ్చారు. ఏవైనా సందేహాలు ఉంటే ప్రజలు 1855 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. హైదరాబాద్ మహానగరంలో జనగణన నిర్వహణ కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని మూడు కార్పొరేషన్లను ఒకే యూనిట్‌గా పరిగణించి, కంటోన్మెంట్ ప్రాంతంతో కలుపుకొని మొత్తం 61 చార్జ్ ఆఫీసర్లను నియమించినట్లు వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారని, నగరవాసులు తమ వివరాలను నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. 16 భాషల్లో పోర్టల్ అందుబాటులో ఉండటం వల్ల విభిన్న ప్రాంతాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. జనగణనతో పాటే కులగణన కూడా నిర్వహిస్తుండటం ఈసారి విశేషమని భారతి హోళికేరి పేర్కొన్నారు. దేశ జనాభా లెక్కల చరిత్రలోనే దీనిని 'మదర్ ఆఫ్ ఆల్ సెన్సెస్' (అన్ని సెన్సెస్‌కు తల్లి వంటిది) గా అభివర్ణిస్తూ, ఈ బృహత్తర క్రతువులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. పారదర్శకమైన గణాంకాల వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పన, అమలు మరింత సమర్థవంతంగా మారుతుందని యంత్రాంగం ఆశిస్తోంది.

# 2027 జనగణన స్వీయ లెక్కల్లో కిషన్ రెడ్డి

హైదరాబాద్, వెలుతురు 2026 ఏప్రిల్ 26:

2027 జనాభా లెక్కలకు సంబంధించి తెలంగాణలో 2026 ఏప్రిల్ 26న స్వీయ గణన అధికారికంగా ప్రారంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ. కిషన్ రెడ్డి.. నిర్ణీత ఆన్‌లైన్ జనగణన పోర్టల్ ద్వారా తన వివరాలను నమోదు చేశారు. తెలంగాణ జనగణన కార్యాలయం ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి ప్రయాణంలో జనాభా లెక్కలు ఒక పునాది రాయి వంటివని అన్నారు. ప్రణాళికా రచన, సుపరిపాలన, సమానాభివృద్ధికి ఇవి కీలక సాధనాలుగా ఆయన అభివర్ణించారు. సమర్థవంతమైన విధాన రూపకల్పన, సమ్మిళిత వృద్ధికి ఖచ్చితత్వంతో కూడిన సమగ్రమైన గణాంకాలు చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. 2027 జనాభా లెక్కల ప్రాముఖ్యతను వివరించిన శ్రీ జీ. కిషన్ రెడ్డి... ఆధునిక డిజిటల్ సాంకేతికతను ఉపయోగించటం ద్వారా ఇదొక పరివర్తనాత్మక దశగా నిలుస్తుందని పేర్కొన్నారు. తద్వారా పారదర్శకత, సామర్థ్యం, సమ్మిళితత్వం మరింత పెరుగుతాయని ఆయన అన్నారు. 2026 ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ గణన సౌకర్యం అందుబాటులో ఉంటుందని.. ఆ తర్వాత 2026 మే 11 నుంచి జూన్ 9 వరకు గృహ జాబితా సేకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇది సమగ్ర సమాచార సేకరణకు బలమైన పునాది వేస్తుందని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న సామాజికఆర్థిక పరిస్థితులపై 2027 జనాభా లెక్కలు స్పష్టమైన అవగాహనను కల్పిస్తాయని.. అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడటంలో ఇవి సహాయపడతాయని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. జనాభా లెక్కల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరిన కేంద్ర మంత్రి.. ఇందులో ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. సేకరించే ప్రతి సమాచారం దేశ భవిష్యత్తుతో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్' స్వప్నాన్ని సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ జనాభా లెక్కల డైరెక్టరేట్ సంచాలకులు భారతి హోళికేరి మాట్లాడుతూ.. అధికారిక వెబ్‌సైట్ అయిన https://se.census.gov.in లో స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేయవచ్చని, తద్వారా జనాభా లెక్కల్లో నేరుగా పాల్గొనవచ్చని తెలిపారు. సమర్పించిన సమాచారం పూర్తి గోప్యంగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. సమాచారాన్ని సమర్పించిన వెంటనే ఒక 'స్వీయ గణన ఐడీ' వస్తుందని.. ఆ తర్వాత జనగణన అధికారి (ఎన్యూమరేటర్) దానిని పరిశీలించి ఖరారు చేస్తారని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్. వీ. కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా తదితరులు పాల్గొన్నారు.

# ఈరోజు డీజిల్, పెట్రోల్ సప్లయ్ పెరగాలి

- **ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోండి**
- **వరి కోత యంత్రాలకు డీజిల్ కొరత రానివ్వొద్దు**
- **ఆయిల్ కంపెనీలు ఉన్నపళంగా పాలసీలు మార్చి ఇబ్బంది పెడితే ఎలా?**
- **అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు**
- **సమస్య చక్కదిద్దేందుకు టాస్క్ ఫోర్స్, కంట్రోల్ రూమ్**




అమరావతి, వెలుతురు ఏప్రిల్ 26:

పెట్రోల్, డీజిల్ విక్రయాల్లో డిమాండ్‌కి తగిన సప్లయ్ ఉండేలా చూడాలని, సోమవారంలోగా రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను, ఆయిల్ కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడిన సీఎం... రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత తలెత్తడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. రిటైల్ ఔట్ లెట్ల దగ్గర వాణిజ్య వినియోగదారులు కొనుగోళ్లు జరపడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు వివరించారు. రాష్ట్రంలో సాధారణంగా పెట్రోల్ రోజుకు 6,330 కేఎల్ అమ్మకాలు జరిగేవని, అయితే శనివారం ఒక్కసారిగా 34 శాతం డిమాండ్ పెరిగి 8,489 కేఎల్‌కు అమ్మకాలు చేరాయని, ఆదివారం కూడా సాధారణ డిమాండ్ కన్నా 22 శాతం అధికంగా 7,750 కేఎల్ వినియోగం ఉందన్నారు. మరోవైపు డీజిల్ విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. సాధారణంగా డీజిల్ రోజుకు 9,048 కేఎల్ అమ్మకాలు జరిగేవని, అయితే శనివారం ఒక్కసారిగా 16 శాతం డిమాండ్ పెరిగి 10,556 కేఎల్‌కు అమ్మకాలు చేరాయని, ఆదివారం కూడా సాధారణ డిమాండ్ కన్నా 3 శాతం అధికంగా 9,392 కేఎల్ వినియోగం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనికి తోడు నయారా, రిలయన్స్, జియో వంటి ప్రైవేట్ ఆపరేటర్లు కూడా తమ కంపెనీ బంకులకు సప్లయ్ నిలిపివేయడం కూడా సమస్యను మరింత తీవ్రతరం చేశాయని జిల్లా కలెక్టర్లు వివరించారు.

**అనుమతులపై పునరాలోచన చేస్తాం**

మరోవైపు కంపెనీలు రిటైల్ ఔట్ లెట్లకు ఇంతకుముందులా క్రెడిట్ ఇవ్వడం లేదని అధికారులు తెలుపగా, ఎందుకు క్రెడిట్ నిలిపేశారని హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ కంపెనీల ప్రతినిధులను సీఎం ప్రశ్నించారు. కంపెనీలు రిటైల్ ఔట్ లెట్ల మధ్య గ్యాప్ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజలను, ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టాలని చూస్తే అనుమతుల విషయం పునరాలోచన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయిల్ కంపెనీల అసంబద్ధ నిర్ణయాల కారణంగా ప్రజలు ఇబ్బందిపడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజల నిత్యావసరాలకు సంబంధించిన అంశంలో బాధ్యత లేకుండా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఆయిల్ కంపెనీలకు తేల్చిచెప్పారు. గురువారమే సమస్యను గుర్తించామని అధికారులు చెప్పగా... మూడు రోజుల క్రితమే సమస్య గుర్తించినప్పుడు ఎందుకు పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు తీసుకోలేదని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య తలెత్తిన తరువాత, ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో తనకు నివేదికలు ఇవ్వడం కాదని... ఫలితాలు చూపించాలని సిఎం స్పష్టం చేశారు.

**రైతులకు కూపన్ విధానం పరిశీలించండి**

మరోవైపు మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు రెవెన్యూ, పోలీస్, లీగల్ మెట్రాలజీ విభాగాలతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ఒక్కసారిగా సమస్య తలెత్తడంపై విచారణ జరపాలని చెప్పారు. అగ్రి, ఆక్వాకల్చర్ అవసరాలు కూడా పెరిగాయని... వరికోత యంత్రాలకు డీజిల్ కొరత రానివ్వొద్దని స్పష్టం చేశారు. రైతులకు కూపన్ విధానం ప్రవేశ పెట్టే ఆలోచన కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు చేయాలని సూచించారు. ప్రతీ బంక్ దగ్గర రెవెన్యూ, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడమే కాకుండా, సీసీ కెమేరాల ద్వారా పర్యవేక్షణ జరపాలన్నారు. ఎక్కడా బ్లాక్‌లో అమ్మకాలు జరగకూడదని చెప్పారు. సోమవారం నాటికి ఎక్కడా నో స్టాక్ బోర్డులు కనిపించకూడదని చెప్పారు.

# “రేవంత్ రెడ్డి హిట్లర్ కాదు హిస్టరీ మేకర్”

- కవిత విమర్శలకు రేఖ బోయలపల్లి ఘాటు కౌంటర్..
- బడ్జెట్‌తోనే బదులిచ్చిన ప్రభుత్వం
- తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ నేత కవిత కల్వకుంట్ల చేసిన విమర్శలకు తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి ఘాటుగా స్పందించారు. “రేవంత్ రెడ్డి హిట్లర్ కాదు...స్థానిక ఎన్నికల్లో 42% బీసీ రిజర్వేషన్ ఇచ్చి సామాజిక న్యాయం సాధిస్తున్న హిస్టరీ మేకర్” అని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3.04 లక్షల కోట్ల బడ్జెట్ ప్రజల సంక్షేమానికి అంకితమైందని రేఖ తెలిపారు. వ్యవసాయానికి 24,000 కోట్లకు పైగా కేటాయింపు, రైతు భరోసా కింద ఎకరాకు ₹12,000, మహాలక్ష్మి పథకానికి ₹4,305 కోట్లు, మహిళా శక్తి మిషన్‌కు 2,500 కోట్లు, కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్‌కు 3,683 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అలాగే విద్యా రంగానికి 26,674 కోట్లు, మహిళా యూనివర్సిటీకి 400 కోట్లు, సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌కు ₹100 కోట్లు కేటాయించడం ద్వారా ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధి ద్వంద్వ దిశలో ముందుకు సాగుతోందన్నారు. రైతులు, మహిళలు, యువత కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రస్తావిస్తూ ₹2 లక్షల వరకు రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 57,000 కోట్ల వడ్డీ లేని రుణాలు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు వంటి చర్యలు ప్రజా పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో సుమారు 7 లక్షల కోట్ల అప్పులు మిగిల్చినప్పటికీ, నెలకు ₹6,500 కోట్ల వడ్డీ భారం ఉన్నా సంక్షేమాన్ని కొనసాగించడం నిజమైన నాయకత్వమని రేఖ వ్యాఖ్యానించారు. 2014-2023 మధ్య కస్టోడియల్ డెత్స్, గురుకుల విద్యార్థుల మరణాలు, నిరుద్యోగ సమస్యలు, పేపర్ లీకేజీలపై అప్పట్లో స్పందించని వారు ఇప్పుడు విమర్శలు చేయడం ఆశ్చర్యకరమని కవిత కల్వకుంట్లను ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ఉద్యమ నేతలను పక్కన పెట్టి కుటుంబ రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చారని, ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ప్రజల తీర్పుతో అధికారం కోల్పోయిన వారు ఇప్పుడు విమర్శలు చేయడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు.తెలంగాణ సమాజం చైతన్యవంతమైందని, ప్రజలు మాటలు కాదు మార్పు చూస్తున్నారని రేఖ బోయలపల్లి అన్నారు.



తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి

# రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత నివారణకు చర్యలు తీసుకోవాలి: ఎంపీ వద్దిరాజు

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 25:**

తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా నెలకొనడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కొరతను వెంటనే నివారించాల్సిందిగా భారత్, హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్స్ ఉన్నతాధికారులను పెట్రోలియం పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యులు,ఎంపీ రవిచంద్ర కోరారు.తాను హైదరాబాద్ నుంచి హన్మకొండకు ఆదివారం వెడుతున్న సందర్భంగా వాహనదారులు బంకుల వద్ద బారులు తీరి ఉండడాన్ని గమనించానని ఫోన్ చేసి అధికారులకు వివరించారు.పెట్రోల్, డీజిల్ కొరతను వెంటనే అరికట్టేందుకు అవసరమైన తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఎంపీ వద్దిరాజు కోరడంతో సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించారు.



# ఇంధన ధరల పెంపు పుకార్లు నమ్మద్దు

- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్

**విజయవాడ వెలుతురు ఏప్రిల్ 26:**

కొంతమంది వ్యక్తులు సంస్థలు పనిగట్టుకుని ఏప్రిల్ నెలాఖరికి పెట్రోల్ డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచేస్తుందని చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ విజ్ఞప్తి చేశారు. గత కొన్ని రోజులుగా పెట్రోల్ బంకుల వద్ద నెలకొన్న గందరగోళ పరిస్థితి నేపథ్యంలో రవికిరణ్ గారు మాట్లాడుతూ కేంద్ర పెట్రోలియం శాఖామాత్యులు శ్రీ హర్దీప్ సింగ్ పూరి గారు ఏప్రిల్ 23 వ తారీఖున విడుదల చేసిన ప్రకటనలో పెట్రోల్ డీజిల్ ధరలని ఎట్టి పరిస్థితుల్లో పెంచబోమని స్పష్టం చేశారని అయినప్పటికీ కొంతమంది పనికట్టుకుని పుకార్లు సృష్టించి ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించి తద్వారా వారి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఇటువంటి అసాంఘిక శక్తులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని రవికిరణ్ డిమాండ్ చేశారు. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా ముడిచమురు భారత్ కి వస్తున్న ఓడల సంఖ్య కొంత తగ్గిన మాట వాస్తవం అయినప్పటికీ భారతదేశంలో కావలసిన నిల్వలు ఉన్నాయి అలాగే ప్రధాని మోడీ గారు 40 పైగా దేశాల నుంచి ముడిచమురు తెప్పిస్తున్నారని చెప్పారు. 2022 నుండి జరుగుతున్న యుక్రిన్ రష్యా యుద్ధం ఇప్పుడు జరుగుతున్న ఇరాన్ ఇజ్రాయిల్ అమెరికా యుద్ధాల కారణంగా ప్రపంచంలో అనేక దేశాలు ఇంధనం విషయంలో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయా దేశాలలో ఇంద్ర ధరలు రెట్టింపు అయ్యాయని కానీ గడిచిన నాలుగేళ్లగా భారతదేశంలో మాత్రమే ఇంధన ధరలు పెరగకుండా స్థిరంగా ఉన్నాయని రవి కిరణ్ గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న క్లిష్ట పరిస్థితులను అర్థం చేసుకుంటూ దేశ ప్రజలు కూడా పూర్తిగా సహకరించాలని రవికిరణ్ కోరారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అవసరం కన్నా ఎక్కువ పెట్రోల్ డీజిల్ కొనుగోలు చేసి నిల్వలు చేయటం మొదలుపెడితే దేశానికి మనం మంచి కన్నా చెడు ఎక్కువ చేసిన వాళ్ళం అవుతామని ఈ సునీత అంశాన్ని ప్రజలు గ్రహించాలని రవికిరణ్ విజ్ఞప్తి చేశారు. ఒక బ్యాంకు దగ్గరికి ఖాతాదారులు అందరూ ఒకేసారి వచ్చి డబ్బులు డ్రా చేసుకోవటానికి ప్రయత్నిస్తే ఆ బ్యాంక్ తాళాలు వేసుకోవలసిన పరిస్థితి వస్తుందో అదే రకంగా అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేయటం వదిలిపెడితే దానికి అంతం ఉండదని ఇప్పుడున్న ప్రపంచ పరిస్థితుల్లో సమస్యని మరింతగా పెంచిన వాళ్ళం అవుతామని రవికిరణ్ విజ్ఞప్తి చేశారు. గడచిన ఏడాది కన్నా ఇప్పుడు అమ్మకాలు 30% పైచిలుకు పెరిగిపోయాయని ఇలాగే కొనసాగిస్తే పరిస్థితి చేయి దాటిపోతుందని, దయచేసి విజ్ఞులైన ప్రజలు సంయమనం పాటిస్తూ ప్రభుత్వానికి సహకరించాలని రవికిరణ్ కోరారు. ప్రభుత్వ అధికారులు మరింత చురుకుగా పనిచేసి ప్రజల్లో చైతన్యం కలిగించాలి. లారీలు బస్సులు, కార్లు టూవీలర్లు వీటికి "కోటా" విధించి అంతకుమించి అమ్మకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి అన్నారు. పెట్రోల్ డీజిల్ లూస్ అమ్మకాలు జరక్కుండా నిషేధించాలని, బ్లాక్ మార్కెట్లో ఇంధనం తరలిపోకుండా చూడాలని, ఇంధనం వృధా చేస్తూ అనవసర తిరుగుళ్ళు మానుకునే విధంగా ప్రజల్ని చైతన్యం పరచాలని రవికిరణ్ అధికారులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# సైబరాబాద్ లో వీకెండ్–స్పెషల్ డ్రంక్ & డ్రైవ్ 245 మందిపై కేసులు

- హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాలు నడుపుతునవారిపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక దృష్టి

**సైబరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:**



సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి I రంజన్ రతన్ కుమార్ తెలిపారు.ఈ డ్రైవ్‌లో భాగంగా 245 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.197 ద్విచక్ర వాహనదారులు,12 ఆటోలు,36 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఏసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —196 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,28 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,21 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ఠ శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారం (20.04.2026-25.04.2026) లో మొత్తం 189 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.వీరిలో 00 మందికి జరిమానా, జైలు శిక్ష,02 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,187 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# వాసవి జయంతి వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

- ఆలయంలో పూర్ణకుంభ స్వాగతం, ప్రత్యేక పూజలు

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:**



సికింద్రాబాద్ ఆవులమందలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన శ్రీ వాసవి అమ్మవారి జయంతి వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, లోకక్షేమం కోసం ఆశీర్వదించే శ్రీ వాసవి మాత పరమేశ్వరి జయంతిని ప్రజాపాలన ప్రభుత్వం తొలిసారిగా అధికారికంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా కొనసాగేందుకు అమ్మవారి ఆశీస్సులు లభించాలని ప్రార్థించినట్లు తెలిపారు.

# స్వీయ జనగణన వివరాలు నమోదు చేసుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**విజయవాడ వెలుతురు ఏప్రిల్ 26:**

స్వీయ జనగణన కార్యక్రమంలో భాగంగా పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ లోని ఆయన నివాసంలో తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర అభివృద్ధికి , సంక్షేమ పథకాల రూపకల్పనకు జనగణన ప్రాతిపదిక అని పేర్కొన్నారు. డిజిటల్ పద్ధతిలో వివరాలను నమోదు చేసే సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని, ఆన్‌లైన్ స్వీయ గణన ద్వారా సమయం ఆదా అవుతుందని, ప్రజలంతా తమ వివరాలను నమోదు చేసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. విద్యావంతులు, యువత తమ వంతుగా ఇతరులకు అవగాహన కల్పించాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# వాసవి మాత ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలి





- రాష్ట్ర రోడ్లు ,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**నల్లగొండ వెలుతురు ఏప్రిల్ 26:**

ఆదివారం మంత్రి నల్గొండ పట్టణంలోని బీట్ మార్కెట్‌లోని రామకోటి స్థూప దేవాలయం మరియు గాంధీ పార్క్‌లో ఘనంగా నిర్వహించిన వాసవి మాత జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుపుకుంటున్న తొలి వాసవి మాత జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహించడం విశేషమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. బాసర, కాళేశ్వరం దేవాలయాలు మరియు గోదావరి పుష్కరాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే, రామకోటి దేవాలయానికి 20 సంవత్సరాల క్రితం ఇచ్చిన హామీలను గుర్తుచేసుకుంటూ, ధ్వజస్తంభం, మార్కెట్ యార్డ్ స్థలం 120 గజాలు మరియు దేవాలయ అభివృద్ధికి మరో 120 గజాలు అందజేసినట్లు చెప్పారు. గుడి ఎదుట పండ్ల మార్కెట్ ఏర్పాటు చేస్తానని చెప్పిన మాటను నిలబెట్టుకున్నానని వివరించారు. పట్టణంలో రామాలయం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, వచ్చే సంవత్సరం ఉత్తర ద్వార దర్శనం వరకు పూర్తి చేస్తామని తెలిపారు. గాంధీ పార్క్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కుంకుమార్చన, అభిషేక కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గాంధీ పార్క్‌లోని భవనాన్ని పునర్నిర్మించేందుకు పూర్తి సహకారం అందిస్తామని, ప్రస్తుతం బాట లేని సమస్యను పరిష్కరించి, డీఎంహెచ్ఓ కార్యాలయం మారిన వెంటనే రహదారి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. అదేవిధంగా రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం, బ్రహ్మంగారి గుట్టలోని శివాలయ అభివృద్ధి పనులను రూ.100 కోట్లతో రెండు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ప్రకాశం బజార్ వ్యాపారుల అభివృద్ధి కోసం ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని సమయాల్లో ప్రజలకు అండగా ఉంటానని మంత్రి స్పష్టం చేశారు. భక్తి, సేవ, అభివృద్ధి అనే మూడు అంశాలలో పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి ,తహసిల్దార్ పరుశురాం ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోనిరమేష్,మాజీ జెడ్పిటిసి గుమ్మలమోహన్ రెడ్డి,మాజీ జెడ్పిసి వంగూరు లక్ష్మయ్య, కార్పొరేటర్లు కవిత ,పెరిక స్వాతి, ఆర్యవైశ్య సంఘం సభ్యురాలు నాంపల్లి భాగ్య, నరసింహ, యమ మురళి, దైవాదినం,ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# సెన్సస్ 2027 లో పాల్గొని విజయవంతం చేయండి సీ.ఎస్ రామకృష్ణారావు





**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:**

దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సెన్సస్ ఆఫ్ ఇండియా-2027 కార్యక్రమంలో భాగంగా ప్రారంభమైన స్వీయ నమోదు (SelfEnumeration) ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఆదివారం పాల్గొన్నారు. ఉదయం తన నివాసంలోనే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వీయ గణన పూర్తి చేసి, ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కుటుంబం స్వీయ గణనలో పాల్గొని తమ వివరాలను నమోదు చేయాలని పిలుపునిచ్చారు. సెన్సస్ ప్రక్రియ దేశ అభివృద్ధికి కీలకమని, ప్రభుత్వ విధానాల రూపకల్పనలో ఖచ్చితమైన గణాంకాలు ఎంతో అవసరమని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సెన్సస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోలికేరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అలా తదితరులు పాల్గొన్నారు. అధికారులు స్వీయ గణన ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సులభంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# వేదన ముందు మేడైనా, గూడైనా ఒకటే!

సమాజం మనుషులను వారి ఆస్తులు, హోదాల ఆధారంగా విభజిస్తుంది. ఒకరికి ఆకాశాన్ని తాకే మేడ ఉంటే, మరొకరికి తల దాచుకోవడానికి చిన్న గూడు మాత్రమే ఉంటుంది. ఈ భౌతిక వ్యత్యాసం సమాజంలో అంతరాలను సృష్టిస్తుంది. కానీ, కవి ఇక్కడ ఒక విప్లవాత్మకమైన పోలికను తెచ్చారు. వేదన లేదా దుఃఖం అనేది వచ్చినప్పుడు, ఆ అగ్ని ధనవంతుడి మేడను, పేదవాడి గూడును సమానంగానే దహిస్తుంది. ప్రకృతి సిద్ధమైన భావోద్వేగాల ముందు ఆర్థిక స్థితిగతులు మోకరిల్లుతాయని చెప్పడం ఇందులో ఉన్న ప్రధాన సందేశం.సాహితీ పరంగా చూస్తే, ఇందులో మేడ మరియు గూడు అనే రెండు పదాలు పరస్పర విరుద్ధమైన స్థితిగతులను సూచిస్తాయి.మేడ, వైభవం, భద్రత, మరియు గర్వానికి చిహ్నం.గూడు, నిస్సహాయత, సరళత, మరియు సామాన్య జీవితానికి ప్రతీక.ఈ రెండింటినీ ఒకటే అని సంబోధించడం ద్వారా కవి సమత్వ భావనను అద్భుతంగా పలికించారు. ఇది కేవలం మాటల కూర్పు కాదు, మానవత్వపు లోతును కొలిచే ఒక కొలమానం.తెలుగు భాషలో మండుట అనే పదానికి చాలా అర్థాలు ఉన్నాయి. కోపం వస్తే కళ్లు మండుతాయి, ఆకలి వేస్తే కడుపు మండుతుంది, కానీ బాధ కలిగితే గుండె మండుతుంది . అగ్ని ఏ వస్తువునైనా భస్మం చేసినట్లే, మానసిక వేదన మనిషి యొక్క అంతరాత్మను దహిస్తుంది. ఈ స్థితిలో ఉన్న వ్యక్తికి తన చుట్టూ ఉన్న ఏసీ గదులు కానీ, మెత్తని పరుపులు కానీ ఉపశమనాన్ని ఇవ్వలేవు. ఆ సమయంలో రాజప్రసాదమైనా, రాతి నేలైనా ఒకటే అని కవి భావం.ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రం ప్రకారం, మనిషి తీవ్రమైన ట్రామా (Trauma) లేదా దుఃఖంలో ఉన్నప్పుడు అతని మెదడు బాహ్య ప్రపంచంలోని విలాసాలను గుర్తించే స్థితిలో ఉండదు. దీనినే Emotional anhedonia అని కూడా అనవచ్చు. అంటే తీవ్రమైన బాధలో ఉన్నప్పుడు ఏ సౌకర్యమూ ఆనందాన్ని ఇవ్వదు. కవి ఈ శాస్త్రీయ సత్యాన్ని అతి తక్కువ పదాలలో, సామాన్యుడికి అర్థమయ్యే రీతిలో మేడ, గూడు ఒకటేలే అని తేల్చి చెప్పారు.మన ప్రాచీన వేదాంతం ప్రకారం, ఈ శరీరం ఒక గూడు వంటిది. ఆత్మ పరమాత్మలో లీనమవ్వాలని తపిస్తుంది. భౌతికమైన సంపదలు (మేడలు) తాత్కాలికమైనవని, మృత్యువు లేదా తీవ్ర వేదన ముందు ఇవన్నీ దిగదుడుపేనని ఆధ్యాత్మికత బోధిస్తుంది. గుండె మండే చోట అంటే వైరాగ్యం కలిగిన స్థితి అని కూడా అనుకోవచ్చు. ఆ స్థితిలో ఉన్న వ్యక్తికి ప్రాపంచిక భేదాలు కనిపించవు.తెలుగు వారు భావోద్వేగాలకు అధిక ప్రాధాన్యతనిస్తారు. మన జానపద గేయాల నుండి ఆధునిక కవిత్వం వరకు కన్నీరు ,కష్టం అనే అంశాలు మనిషిని మనిషిగా మార్చే క్రియలుగా వర్ణించబడ్డాయి. ఈ చరణం తెలుగు వారి హృదయాల్లో ఎందుకు అంతగా నాటుకుపోయిందంటే, ఇది మన సంస్కృతిలోని సహానుభూతి (Empathy) అనే గుణాన్ని తట్టి లేపుతుంది. ఎదుటివాడి బాధను చూసి, వాడు ధనవంతుడా లేక పేదవాడా అని చూడకుండా, వాడు కూడా మనలాంటి మనిషే అని గుర్తించేలా చేస్తుంది.శ్రీశ్రీ, ఆత్రేయ, వేటూరి వంటి మహానుభావులు సమాజంలోని పీడిత వర్గాల గురించి, మానవ నైజం గురించి ఎన్నో అద్భుతాలు రాశారు. ఈ చరణం కూడా ఆ కోవకే



చెందుతుంది. ఇది ఒక వ్యక్తిగత దుఃఖాన్ని సామాజిక సత్యంగా మార్చిన తీరు ప్రశంసనీయం. ఒక చిన్న వాక్యంలో ఇంతటి గాంభీర్యాన్ని నింపడం అనేది తెలుగు సినీ కవులకే సాధ్యమైన విద్య.సమాజంలో ధనవంతుడు తన మేడలో ఉండి పేదవాడి గూడును తక్కువగా చూడవచ్చు. కానీ ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు లేదా ప్రాణాంతకమైన బాధ కలిగినప్పుడు ప్రకృతి ఎవరికీ మినహాయింపు ఇవ్వదు. ఈ చరణం సమాజంలోని గర్విష్టులకు ఒక హెచ్చరిక వంటిది. నీ మేడ నిన్ను బాధ నుండి రక్షించలేదు అని చెప్పడం ద్వారా కవి ఒక నిశ్శబ్ద విమర్శను సంధించారు. చివరికి మనిషి మిగిల్చుకునేది కేవలం జ్ఞాపకాలు మరియు అనుభవాలు మాత్రమే. చావు అందరినీ ఎలా సమానం చేస్తుందో, తీవ్రమైన వేదన కూడా మనిషిని అలాగే శుద్ధి చేస్తుంది. అహంకారం నశించి, మనిషి తన తోటి మనిషిని ప్రేమించే స్థితికి చేరుకోవడమే ఈ పాట యొక్క అంతిమ ఉద్దేశ్యం.గుండె మండే చోట మేడ, గూడు ఒకటేలే అనే మాటలు విన్నప్పుడు మనకు కలిగే అనుభూతి ఒకటే నమ్రత (Humility). మన దగ్గర ఎంత ఉన్నా, మనం ఎంత ఎత్తులో ఉన్నా, బాధ అనేది అందరికీ సమానమే అనే సత్యం మనల్ని నేల మీద నడిపిస్తుంది. ఈ చరణం మనకు నేర్పే పాఠం ఏమిటంటే సంపద మనిషికి సౌకర్యాన్ని ఇవ్వగలదేమో కానీ, శాంతిని ఇవ్వలేదు. శాంతి అనేది మన హృదయ స్థితి మీద ఆధారపడి ఉంటుంది తప్ప, మనం నివసించే కట్టడం మీద కాదు.తెలుగు సాహిత్యం ఉన్నంత వరకు, మానవ హృదయం స్పందించినంత వరకు, ఈ చరణం ఒక దిక్సూచిలా వెలుగుతూనే ఉంటుంది. ఇది కేవలం ఒక సినిమా పాటలోని పల్లవి మాత్రమే కాదు, ఇది నిత్య జీవిత సత్యం. మేడలు కూలిపోవచ్చు, గూళ్లు చెదిరిపోవచ్చు, కానీ ఈ మాటల్లోని సత్యం మాత్రం ఎప్పటికీ అజరామరం.వేదన అగ్నిలా జ్వలించే చోట సామాజిక హోదాలు హారతి కర్పూరంలా కరిగిపోతాయి. అక్కడ ఐశ్వర్యానికి ప్రతీకైన మేడ , నిరుపేదరికానికి ఆసరా అయిన గూడు అనే భేదమే ఉండదు. కన్నీటి ధారలో అంతస్తులన్నీ కొట్టుకుపోయి, మనిషి కేవలం మనిషిగా మిగిలే ఆ క్షణమే అన్నింటికంటే మిన్నయైన మానవత్వాన్ని సమున్నతంగా చాటిచెబుతుంది. సామాజిక గోడలను కూల్చివేస్తూ, మన అంతరాత్మను తట్టిలేపే ఈ అక్షర సత్యం సమాజం పట్ల బాధ్యతాయుతమైన స్పృహను రగిలిస్తూ, మనిషిని తాత్విక చింతన వైపు నడిపించే ఒక దిక్సూచిగా నిలుస్తుంది.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# తెలంగాణ రాజకీయాల్లో కొత్త "గాలి

## " ఇది తుఫానా..! లేక తాత్కాలిక ఊపు మాత్రమేనా..?

తెలంగాణ రాజకీయాల్లో నిశ్శబ్దంగా పెరుగుతున్న అసంతృప్తి ఇప్పుడు ఒక కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నది. ఈ పరిణామం సాధారణ రాజకీయ పరిణామంగా మాత్రమే కాకుండా, రాష్ట్ర ఆత్మను, ఉద్యమ వారసత్వాన్ని, భవిష్యత్తు దిశను తిరిగి ప్రశ్నించే దశగా మారుతోంది. ఈ సందర్భంలో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించిన "తెలంగాణ రాష్ట్ర సేన" పార్టీ, ఒక సాధారణ కొత్త రాజకీయ పార్టీగా కాకుండా ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం ఎదురుచూస్తున్న వర్గాలకు ఒక సంకేతంగా కనిపిస్తోంది. రాష్ట్ర నిర్మాణానికి దశాబ్దం పూర్తవుతున్న ఈ సమయంలో, "ఉద్యమం ముగిసిందా? లేక ఇంకా అసంపూర్తిగానే ఉందా?" అనే ప్రశ్న మళ్లీ రాజకీయ చర్చల కేంద్రంగా మారింది.






తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం ఒక రాజకీయ ప్రక్రియ మాత్రమే కాదు, అది ఒక భావోద్వేగ ప్రవాహం, ఒక సామూహిక ఆకాంక్ష, ఒక చరిత్రాత్మక పోరాటం. అయితే రాష్ట్రం ఏర్పడిన తరువాత అభివృద్ధి సమానంగా జరిగిందా? గ్రామీణ ప్రాంతాలు నిజంగా ఎదిగాయా? యువతకు అవకాశాలు విస్తరించాయా? అనే ప్రశ్నలు మళ్లీ వినిపించడం యాదృచ్ఛికం కాదు. ఈ ప్రశ్నలే ఇప్పుడు కొత్త రాజకీయాలకు బీజం వేస్తున్నాయి. ఈ ఖాళీని గుర్తించిన కవిత, ప్రాంతీయ గౌరవం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అనే త్రిసూత్రంతో ముందుకు రావడం ఒక వ్యూహాత్మక నిర్ణయం.

ఈ కొత్త పార్టీకి ప్రధాన ఆకర్షణ మహిళా నాయకత్వం. భారత రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతున్నప్పటికీ, స్వతంత్రంగా మహిళ ఆధ్వర్యంలో ఒక ప్రాంతీయ పార్టీ ముందుకు రావడం అరుదైన పరిణామం. ఈ నేపథ్యంలో కవిత నాయకత్వం ఒక కొత్త రాజకీయ ప్రయోగంగా భావించవచ్చు. మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం సహాయక సంఘాల బలోపేతం, భద్రత, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలను స్పష్టమైన కార్యాచరణగా మార్చగలిగితే, మహిళా ఓటు సమీకరణంలో గణనీయమైన మార్పు తీసుకురావడం సాధ్యమవుతుంది. అయితే నాయకత్వం వారసత్వంగా రావచ్చు గానీ, ప్రజాదరణ మాత్రం సాధించుకోవాల్సిందే అన్న వాస్తవాన్ని ఆమె నిరూపించుకోవాలి.

యువత అంశం ఈ పార్టీ భవిష్యత్తును నిర్ణయించే కీలక అంశం. తెలంగాణలో నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాలపై అధిక ఆధారపడటం, ప్రైవేట్ రంగంలో పరిమిత అవకాశాలు యువతలో అసంతృప్తిని పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో స్టార్టప్స్, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై స్పష్టమైన దిశానిర్దేశం ఉంటే, యువతను ఆకర్షించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా స్టార్టప్ సంస్కృతి విస్తరిస్తున్న వేళ, ఈ అంశాన్ని కవిత పార్టీ ఎలా మలుస్తుందో చూడాలి.

సామాజిక న్యాయం తెలంగాణ రాజకీయాల్లో ఎప్పుడూ కేంద్రాంశమే. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకు రాజకీయ, ఆర్థిక ప్రాతినిధ్యం పెంచడం ద్వారా కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా బీసీ వర్గాలపై దృష్టి పెడితే గ్రామీణ స్థాయిలో బలమైన మద్దతు లభించవచ్చు. అయితే "సామాజిక న్యాయం" అనే నినాదం ఇప్పుడు ప్రజలకు కొత్తగా అనిపించడం లేదు. అది అమలు రూపంలో కనిపించాలి. బీసీ సీఎం చేస్తారా? దళిత ముఖ్యమంత్రి చేస్తారా? వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేకపోతే ఈ నినాదం ప్రభావం కోల్పోతుంది.

ఇక్కడ మరో కీలక అంశం కుటుంబ రాజకీయాలు. కవిత తన తండ్రి K. చంద్రశేఖర రావు పై నేరుగా విమర్శలు చేయడం రాజకీయంగా ధైర్య నిర్ణయం. కానీ అదే సమయంలో అది ప్రజల్లో ఎలా ప్రతిస్పందన కలిగిస్తుందో అనేది ప్రశ్న. ఆమె ఎదుగుదలకు కారణమైన కుటుంబాన్ని విమర్శించడం ఒకవైపు స్వతంత్రతకు సంకేతం అయితే, మరోవైపు విశ్వసనీయతపై సందేహాలు రేకెత్తించే అవకాశం కూడా ఉంది. ఇక K. T. R. హరీశ్ రావు వంటి బలమైన నాయకులు ఉన్న నేపథ్యంలో ఈ కుటుంబ విభేదాలు రాజకీయ సమీకరణాలను ఎలా ప్రభావితం చేస్తాయో చూడాలి.

కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే అధికారంలో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యతిరేకత పెరుగుతోందనే వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో కేసీఆర్ పట్ల కొంత సానుభూతి కూడా కనిపిస్తోంది. ఈ పరిస్థితిలో కవిత కొత్త పార్టీ ప్రారంభించడం కాంగ్రెస్‌కు లాభమా? లేక బీజేపీకి ఆటంకమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మూడు ప్రతిపక్ష శక్తులు విడిపోయి పోటీ పడితే అధికార పార్టీకి లాభం కలిగే అవకాశముంది.

కవిత ప్రకటించిన "పాంచజన్యం" హామీలు ఆకర్షణీయంగా ఉన్నాయి, ఉచిత విద్య, ఉచిత వైద్యం, నాలుగు లక్షల ఉద్యోగాలు, సామాజిక న్యాయం, రైతు సంక్షేమం. కానీ ఇవి అమలు చేయాలంటే అవసరమైన ఆర్థిక వనరులు ఎక్కడి నుంచి వస్తాయి? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిందే. మాటలకంటే ఆర్థిక ప్రణాళికలు ప్రజలను ఎక్కువగా నమ్మిస్తాయి.

ఇక్కడ ఒక ముఖ్యమైన అంశం సంస్థాగత నిర్మాణం. ఒక పార్టీ విజయవంతం కావాలంటే నాయకత్వం మాత్రమే కాదు, పునాదుల నుంచి నిర్మాణం అవసరం. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బలమైన కార్యకర్తల వలయం, రెండో శ్రేణి నాయకత్వం లేకుండా పార్టీ నిలబడదు. లేకపోతే అది గాలివాటం ప్రచారంగా మిగిలిపోతుంది. మూడు స్థిరపడిన పార్టీలను ఒకేసారి ఎదుర్కోవడం అభిమన్యుడు పద్మ వ్యూహంలో ప్రవేశించినట్లే అవుతుంది.

చివరగా, తెలంగాణ రాష్ట్ర సేన భవిష్యత్తు పూర్తిగా కల్వకుంట్ల కవిత వ్యక్తిగత ప్రతిభపై మాత్రమే ఆధారపడదని స్పష్టంగా చెప్పాలి. ఒక నాయకురాలి వాగ్ధాటి, అనుభవం, రాజకీయ వారసత్వం ఇవన్నీ ప్రారంభానికి బలం ఇచ్చినా, దీర్ఘకాలిక విజయాన్ని నిర్ణయించేది మాత్రం పార్టీ నిర్మాణం, ప్రజలతో బంధం, మరియు విధానాల అమలు సామర్థ్యమే. తెలంగాణలో ఇప్పటికే బలంగా వేర్లు వేసుకున్న రాజకీయ శక్తుల మధ్య కొత్త పార్టీగా ఎదగడం అనేది సులభమైన పని కాదు. అందుకోసం కేవలం విమర్శలు సరిపోవు,ప్రత్యామ్నాయ దారిని స్పష్టంగా చూపించాలి.ప్రజల్లో విశ్వాసాన్ని నిర్మించుకోవడం అంటే ఒక్కసారిగా జరిగే ప్రక్రియ కాదు. అది క్రమబద్ధమైన, నిరంతర ప్రయత్నాల ఫలితం. గ్రామస్థాయి నుంచి ప్రారంభమయ్యే సంస్థాగత నిర్మాణం, స్థానిక సమస్యలపై చురుకైన స్పందన, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం, ఇవి పార్టీకి పునాదులుగా మారాలి. ముఖ్యంగా యువత, మహిళలు, రైతులు వంటి వర్గాల సమస్యలను కేవలం ఎన్నికల హామీలుగా కాకుండా, దీర్ఘకాలిక విధానాలుగా మలచగలిగితేనే ప్రజలు నమ్మకం పెంచుకుంటారు.ఇక హామీల విషయానికి వస్తే, అవి ఎంత ఆకర్షణీయంగా ఉన్నా వాటి అమలు సాధ్యాసాధ్యాలపై స్పష్టత లేకపోతే అవి ప్రజల్లో సందేహాలను కలిగిస్తాయి. ఉచిత విద్య, ఉచిత వైద్యం, భారీ స్థాయిలో ఉద్యోగాలు, ఇవి అన్నీ ప్రజల ఆకాంక్షలకు దగ్గరగా ఉన్నప్పటికీ, వాటిని ఎలా అమలు చేస్తారు? అవసరమైన ఆర్థిక వనరులు ఎక్కడి నుంచి సమీకరిస్తారు? అనే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిందే. ప్రణాళికాబద్ధమైన ఆర్థిక దృష్టి లేకుండా పెద్ద హామీలు ఇవ్వడం రాజకీయంగా ప్రమాదకరం కూడా కావచ్చు.

నాయకత్వ స్థిరత్వం కూడా ఈ పార్టీ భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తుంది. ఒక వ్యక్తి ఆధారంగా నడిచే పార్టీలు ప్రారంభంలో ఉత్సాహాన్ని సృష్టించినా, కాలక్రమేణా అవి బలహీనపడే అవకాశముంది. అందుకే రెండో శ్రేణి నాయకత్వాన్ని పెంచడం, వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం, అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాటించడం అవసరం. ఇది పార్టీకి దీర్ఘకాలిక స్థిరత్వాన్ని ఇస్తుంది.

అన్నిటికంటే ముఖ్యంగా ప్రజలతో నిరంతర సంబంధం అత్యవసరం. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల్లోకి వెళ్లడం కాదు, వారి సమస్యలను వినడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం, సాధ్యమైన చోట వెంటనే చర్యలు తీసుకోవడం,ఇవి ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతాయి. ఒకసారి ప్రజలు పార్టీపై నమ్మకం పెంచుకుంటే, ఆ నమ్మకమే రాజకీయ బలం అవుతుంది.

మొత్తానికి, తెలంగాణ రాష్ట్ర సేన ఒక కొత్త అధ్యాయం ప్రారంభించిందని చెప్పవచ్చు. కానీ ఆ అధ్యాయం విజయగాథగా మారాలంటే మాటలు కాదు, స్పష్టమైన కార్యాచరణ, పారదర్శకత, సమగ్ర విధానాలు, మరియు ప్రజలతో బలమైన అనుబంధం అవసరం. ఈ నాలుగు అంశాలను సమర్థవంతంగా అమలు చేయగలిగితేనే ఈ కొత్త రాజకీయ ప్రయోగం తెలంగాణ రాజకీయాల్లో స్థిరమైన ముద్ర వేయగలదు. లేదంటే అది మరో తాత్కాలిక ప్రయోగంగా మిగిలిపోయే ప్రమాదం ఉంటుంది, గతంలో అనేక పార్టీలు అనేక రకాలుగా ముందుకు వచ్చిన పార్టీలు ప్రజల్లో స్థిరంగా ఇమడలేక పోయారనేది తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మన్నారం నాగరాజు.
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

# ఆరుట్ల గ్రామంలో ఉప మండల హిందూ సమ్మేళనం ఘనంగా అంగారంగా వైభవంగా జరిగింది


ఆరుట్ల గ్రామంలో హిందూ సమ్మేళనం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సామాజిక కార్యకర్త ఏదు దొడ్ల శ్రీనివాస్ రెడ్డి


ఆరుట్ల హిందూ సమ్మేళనంలో నాట్యం చేస్తున్న చిన్నారులు


హిందూ సమ్మేళన కార్యక్రమానికి హాజరైన గ్రామ పెద్దలు ప్రజలు

- **హిందూ సాంప్రదాయాలు కాపాడుకోవాలి**
- **హిందువులంతా ఏకం కావాలి స్వామీజీ శ్రీ శ్రీనివాస్ శర్మ**

మంచాల వెలుతురు ఏప్రిల్ 26:

మంచాల మండలం ఆరుట్ల గ్రామ అంబేద్కర్ చౌరస్తాలో ఆరుట్ల ఉప మండల హిందూ సమ్మేళనం కార్యక్రమం మహిళా అధ్యక్షురాలు ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కుమార్ అధ్యక్షతన హిందూ సమ్మేళన కార్యక్రమం ప్రారంభం అయ్యింది హిందూ సమ్మేళనం అత్యంత ఘనంగా అంగ రంగ వైభవంగా విజయవంతంగ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్వామీజీ శ్రీ శ్రీనివాస్ శర్మగారు హిందూ ధర్మ పరిరక్షణ సమాజ ఐక్యత సాంప్రదాయాల కాపాడాల్సి న అవసరంపై ప్రబోధాత్మక సందేశం అందించారు ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త శ్రీ ఏదు దొడ్ల శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) గురించి మాట్లాడి న వక్తలు 1925లో స్థాపించబడిన ఈసంస్థ దేశంలో అత్యంత ప్రాచీన మైన మరియు ప్రభావవం తమైన స్వచ్ఛంద సంస్థలలో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు వ్యక్తిత్వ వికా సందేశభక్తి సేవా భా వం పెంపొందించడంలో ఆర్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు దేశవ్యాప్తంగా లక్షకుపైగా శాఖల ద్వారా ప్రతిరోజూ యువతకు శారీరక మానసిక సాంస్కృతిక శిక్షణ అందిస్తూ సమాజంలో క్రమశిక్షణఐక్యత సేవాస్ఫూర్తిని పెంపొందిస్తున్నదని వివరించారుఅలాగే ప్రకృతి వైపరీత్యాలు సా మా జిక సమస్యలు సేవాకార్యక్రమాల సమయంలో ఆర్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు విశేషంగా ని లుస్తున్నాయని గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయివరకు సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తిగా ఆర్ ఎస్ఎస్ ఎదిగిందని వక్తలు తెలిపారు భవిష్యత్తులో ప్రతి గ్రామంలో శాఖలు విస్తరించడం ద్వారా దే శం మరింత బలపడుతుందని యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలదని వారు అభి ప్రా యపడ్డారురాష్ట్రీయస్వయంసేవక్ సంఘ్ 100 సంవత్సరాల ప్రయాణంలో దేశవ్యాప్తంగా లక్షకు పైగా శాఖలు ప్రతిరోజూ నడుస్తున్నాయని తెలిపారు. ప్రతి గ్రామంలో శాఖలు విస్తరించినప్పుడు దేశం విశ్వగురువుగా ఎదగగలదని సమాజంలోని అనేక సమస్యలకు శాఖలే పరిష్కార మార్గాలని ఆయన పేర్కొన్నారుఅలాగే కళ్యాణ్ చెట్లపల్లిగారు సమాజంలో ఐక్యత సేవాభావం యువత బాధ్యతల ప్రాముఖ్యతను వివరించారు మహిళా వక్త డాక్టర్ స్రవంతి గారు మహిళల భాగస్వామ్యం సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు ఈ కార్యక్రమానికి హిందూ సమ్మేళన సమి తి అధ్యక్షులు శ్రీ దంటు మధుసూదన్ రెడ్డి గారు మహిళా అధ్యక్షురాలు శ్రీమతి శోభ గారు (ఆరుట్ల గ్రామ సర్పంచ్) అధ్యక్షత వహించారు కార్యక్రమ నిర్వహణలో కమిటీ సభ్యులు యువతమహిళ లు చురుకుగా పాల్గొనిహిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు కార్యక్రమం లోసు మారు 2500 మంది హిందూ బంధువులు కుటుంబ సమేతంగా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయడంతో పాటు ఆధ్యాత్మిక సాంస్కృతిక ఉత్సాహాన్ని ప్రతిబింబించారు ఈసమ్మేళనం ద్వారా హిందూ ఐక్యత సంస్కృతి పరిర క్షణపై అవగాహన మరింతగా పెరిగింది హిందూ సమ్మేళన కార్యక్రమానికి విచ్చేసిన గ్రామ ప్రజలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు పెద్దఎత్తున పాల్గొని హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతంచేశారు

# రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

రంగారెడ్డి జిల్లా వెలుతురు ఏప్రిల్ 26:

రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్నరైతు సోదరులంతా తప్పక రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, తద్వారా రిజిస్ట్రేషన్ ఐడి (Registration ID) నంబరు పొందాలని శ్రీమతి డి. ఉష, జిల్లా వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు.

**రైతు రిజిస్ట్రేషన్ ఎందుకు?**

- రైతు బీమా, సబ్సిడీలు మరియు ఇతర పథకాలు రావడానికి
- ప్రభుత్వ పథకాలలో పారదర్శకత కోసం.
- ప్రత్తి, వరి కొనుగోలు మరియు పంట రుణాలకు ఇది కీలకం.
- కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా పొందవచ్చు.
- వరి కొనుగోలు మరియు పంట రుణాల కోసం.
- ప్రభుత్వ పథకాలలో పారదర్శకత పెరుగుతుంది.

**అవసరమైన పత్రాలు:**

- ఆధార్ కార్డు
- భూమి పట్టా పాసు బుక్కు
- ఆధార్ లింకు మొబైల్ నంబర్

**ఎక్కడ నమోదు చేసుకోవాలి?**

మీ గ్రామ పరిధిలోని రైతు వేదిక నందు వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) వద్ద మరియు దగ్గరలోని అన్ని మీసేవ (Meeseva) కేంద్రాలలో చేయబడును.

**రిజిస్ట్రేషన్ షెడ్యూల్:**

ఏప్రిల్ 22 నుండి 30 వరకు.

ప్రత్యేకమైన డ్రైవ్ జిల్లా మొత్తం అమలు చేయబడుతుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం పరచుకోవాల్సిందిగా తెలియజేయడమైనది.

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి.

# చెన్నారెడ్డి గూడ గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలి

- **ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**
- **-చెన్నారెడ్డి కూడా గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తాను**
- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

మంచాల వెలుతురు ఏప్రిల్ 26:



మంచాల మండలం చెన్నారెడ్డిగూడ గ్రామనికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామశాఖ అధ్య క్షుడు పగడాల శ్రీశైలం కార్యదర్శి గ్యార రాజు ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రం గారెడ్డి గారిని కలిసి చెన్నరెడ్డిగూడ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరుచేయా లి అని వినతి పత్రం అందజేశారు చెన్నారెడ్డి గూడ గ్రామంలోని పిడుగు ఎల్లయ్య ఇంటి నుండి పాండు ఇంటి వరకు మరియు ఎండి గౌస్ ఇంటి నుండి బాణావత్ శ్రీను ఇంటి వరకు జెనిగే సోమ య్య ఇంటి నుండి బాలముని నరసింహ ఇంటి వరకు నెట్టు మైసమ్మ ఇంటి నుండి సంకటి మల్ల య్య ఇంటి వరకు సిసి రోడ్ల నిర్మాణం చేయాలి అని ఎమ్మెల్యే గారికి చెప్పడం జరిగింది వెంటనే స్పందించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారుచెన్నారెడ్డి గూడ గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తాను అని అన్నారు గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే ల క్ష్యంగా ప్రజాపాలన సాగిస్తున్నాం అని అన్నారు ఈకార్యక్రమంలో మంచాల వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్ మాజీ సర్పంచ్ అంబోత్ కిషన్ నాయక్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు క ట్రోత్ హర్య రత్నావత్ హరియా చీమల రమేష్ పిడుగు యాదగిరి కాట్రోత్ జవహర్ లాల్ రత్నావ త్ నాగేష్ తదితరులుపాల్గొన్నారు

# 7వ రోజు బడి బాటా / హాస్టల్ బాటా ప్రత్యేక నమోదు కార్యక్రమం

రంగారెడ్డి జిల్లా వెలుతురు ఏప్రిల్ 26:

ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సంక్షేమ వారోత్సవాలలో భాగంగా, అన్ని ఎస్సీ/ఎస్టీ/బీసీ/మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు మరియు ఆశ్రమ పాఠశాలల లో "బడి బాట/హాస్టల్ బాట" ప్రత్యేక నమోదు కార్యక్రమంగా 7వ రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం, అన్ని ఖాళీలను గుర్తించి భర్తీ చేయడం మరియు అర్హత ఉన్న ఏ విద్యార్థి కూడా ప్రవేశం లేకుండా మిగిలి పోకుండా చూడటం.

దీని ప్రకారం, హాస్టళ్లు మరియు ఆశ్రమ పాఠశాలల్లోని ఖాళీల సంఖ్యను గుర్తించడానికి అన్ని సంస్థలు క్షుణ్ణంగా మదింపు నిర్వహించాయి. గుర్తించిన ఖాళీల ఆధారంగా, ఒక ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టారు. అన్ని సీట్లను నింపడానికి మరియు విద్యార్థుల నమోదును మెరుగుపరచడానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, తల్లిదండ్రులలో అవగాహన కల్పించడానికి మరియు ప్రవేశాలను ప్రోత్సహించడానికి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారాన్ని బలోపేతం చేయడానికి మరియు అర్హులైన కుటుంబాలతో సంబంధాలు ఏర్పరచుకోవడానికి స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు సమాజ సభ్యులను కూడా ఇందులో భాగస్వాములను చేశారు.

అన్ని సంక్షేమ హాస్టళ్లు మరియు ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలను గరిష్ఠ స్థాయికి పెంచడానికి మరియు ఆక్యుపెన్సీని మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమం సమాజం యొక్క క్రియాశీల మద్దతుతో, సంక్షేమ/ABCDOS/ఎస్సీ/ఎస్టీ/



బీసీ/మైనారిటీ ASCDO/ASWO/ATWO/ హాస్టల్ సంక్షేమ అధికారులు మరియు సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించబడింది.

7వ రోజు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది మరియు ఖాళీలను భర్తీ చేయడానికి, అర్హులైన విద్యార్థులందరికీ హాస్టల్ మరియు ఆశ్రమ పాఠశాల సౌకర్యాలు అందేలా చూడటానికి ప్రత్యేక ప్రయత్నాలు జరిగాయి.

# 28 మద్యం బాటిళ్ల స్వాధీనం..



మహేశ్వరం వెలుతురు ఏప్రిల్ 26:


ఎలాంటి అనుమతులు లేకుండా ఎన్డిపిఎల్ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ను గ్రాండ్ రిసార్ట్ స్పోర్ట్స్ కంట్రీ లో నిల్వ చేశారు.


ఎలాంటి అనుమతులు లేకుండా 28 మద్యం బాటిల్లు ఉన్నాయని సమాచారం మేరకు రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ ఏ టీం సీఐ బాలరాజు సిబ్బంది కలిసి దాడి చేసి 28 మద్యం బాటిలను స్వాధీనం చేసుకున్నారు.

19 మద్యం బాటిల్లు జానీ వాకర్ గా మిగిలిన ఇతర బాటిల్స్ ఉన్నట్లు గుర్తించారు.

ఈ కేసులో భవిష్ రాజేష్ జైన్, తనీష్ అగ్రవాల్ అనే వ్యక్తులను అరెస్టు చేసి మహేశ్వరం ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు రంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్ తెలిపారు.

# 27 నుంచి సంక్షేమ వారోత్సవాలు ప్రారంభం





- **బాలలభద్రత–మాదకద్రవ్యాల నివారణపై ప్రత్యేక దృష్టి..**
- **సమర్థవంతంగా నిర్వహించాలి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

వెలుతురు, హైదరాబాద్ ఏప్రిల్ 26:

ఈ నెల 27 నుండి మే 5 వరకు నిర్వహించనున్న "బాలల భద్రత, రక్షణ మాదకద్రవ్యాలకు వద్దు చెప్పండి సంక్షేమ వారోత్సవాలు" కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఐసిడిఎస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ఇప్పటికే చేపట్టిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేశామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో బాలల భద్రత, రక్షణతో పాటు మాదకద్రవ్యాల నివారణపై నిర్వహించనున్న వారోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద నిర్దేశించిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, జిల్లాలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, డిప్యూటీ కలెక్టర్ కె. శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి శ్రీలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలితా దేవి, ఆర్డీవోలు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాకేత్ టౌన్‌షిప్‌లో ఆక్సికేర్ ఉచిత వైద్య శిబిరానికి జనసందోహం

కాప్రా, ఏప్రిల్ 26 వెలుతురు:

కాప్రా డివిజన్ పరిధిలోని సాకేత్ టౌన్‌షిప్, ఈసీఐఎల్ చౌరస్తాలో ఆక్సికేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. స్థానిక కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు.

ఈ శిబిరంలో ఆస్పత్రి సిఎండి డాక్టర్ ఎ. చైతన్య రెడ్డి, సీఈఓ మరియు ప్రముఖ నేత్ర వైద్యురాలు డాక్టర్ ఎ. శివరేఖ స్వయంగా పాల్గొని రోగులను పరీక్షించారు. వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఉచిత మందులను పంపిణీ చేశారు. ముఖ్యంగా నేత్ర సంబంధిత సమస్యలు, రక్తపోటు, షుగర్ వంటి వ్యాధులపై ప్రత్యేకంగా



పరీక్షలు నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా డాక్టర్ చైతన్యరెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ఆరోగ్యంపై అవగాహన చాలా అవసరమని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. డాక్టర్ శివరేఖ మాట్లాడుతూ, చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకోవడం ద్వారా పెద్ద సమస్యలను నివారించవచ్చని సూచించారు. ప్రజలు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

శిబిరం నిర్వహణలో ఆస్పత్రి సిబ్బంది సమన్వయంతో సేవలు అందించగా, ప్రతి ఒక్కరికి సముచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమాన్ని కాలనీ వాసులు అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు.

మొత్తంగా ఈ ఉచిత వైద్య శిబిరం స్థానిక ప్రజలకు ఉపయుక్తంగా నిలిచింది. ఆరోగ్య సేవలను ప్రజలకు దగ్గర చేసేందుకు ఆక్సికేర్ హాస్పిటల్స్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.

# వాసవి కన్యక పరమేశ్వరి జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్.



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 26:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని గాజులరామారంషాపూర్ నగర్ ఆర్యవైశ్య అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో లోని శ్రీశ్రీశ్రీ వాసవి కన్యక పరమేశ్వరి జయంతి సందర్భంగా ఆదివారం ఆర్యవైశ్య అసోసియేషన్ వారి ఆహ్వానం మేరకు ఈరోజు స్థానిక కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ హాజరై ఆ వాసవి మాత ఆలయం లో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యేశ్రీశైలంగౌడ్ ఆర్యవైశ్యులలో ఉద్దేశించి మాట్లాడుతూ ఆ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారి ఆశీస్సులు, దీవెనలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు, ఇంత గొప్పగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సోదరులందరికీ అభినందించారు.అనంతరం ఆర్యవైశ్య అసోసియేషన్ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ని శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య అసోసియేషన్ అధ్యక్షులు పవన్ గుప్తా, హర్ష, జగదీష్,వాస శ్రీనివాస్, ఆకుల ప్రభాకర్ మరియు ఇతర సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

# మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పై ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

- **మంచాల మండల బిఆర్ పార్టీ అధ్యక్షులు చీరాల రమేష్**

మంచాల వెలుతురు ఏప్రిల్ 26:

మంచాల మండలం కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ మాట్లాడుతూ శనివారం రోజు మంచాల పర్యటనలో భాగంగా కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి పై అనుచిత రాజకీయ వాక్యాలు చే యడం ఖండిస్తున్నాం మాజీ ఎమ్మెల్యేమంచిరెడ్డి కిషన్ రెడ్డి గా రు 15 సంవత్సరాలు ఈప్రాంతానికి ఎంతో సేవచేశారు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మంచాల మండలానికి అనేక నిధులు తెచ్చి మం డలాన్ని అభివృద్ధి చేయడం జరిగింది కళ్యాణలక్ష్మీ చెక్కులుకూడా ఏ నెల చెక్కులు ఆనెలలోనే పంపిణీ చేయడం జరిగింది ప్రస్తుతం ఎమ్మెల్యే



రెండున్నర సంవత్సరాలు గడిచిన ఇప్పుడు ఊరికి నాలుగు కళ్యాణలక్ష్మి చెక్కులు పంచుతున్న కార్యక్రమంలో కింద ఉన్న లబ్ధిదారులు కళ్యా ణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం ఏమైంది అని అడుగుతున్న సందర్భంలో లబ్ధిదారుల దృ ష్టి మార్చడానికి అధికార కార్యక్రమంలో అధికారులు పక్కన ఉన్నా మాజీ ఎమ్మెల్యేగారిపై రాజకీ య వేదిక పై విమర్శించినట్టు అనుచిత వ్యాఖ్యలను చేయడం సరికాదు ఇదే పద్ధతిలో మాజీ ఎ మ్మెల్యే గారిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరు కునేది లేదు బుద్ధి మానకుంటే మంచాల మండలం ప్రజలు మీకు బుద్ధి చెప్తారని హెచ్చరించారు ఈకార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మాజీ మార్కెట్ కమి టీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య బిఆర్ ఎస్ పార్టీ మండలం ప్రధాన కార్యదర్శి బహదూర్ నాయక్ బీసీ సెల్ అధ్యక్షుడు రావుల శంకర్ అమరేందర్ రెడ్డి కసరమోని మ హేందర్ ఇబ్రహీంపట్నం మాజీ మార్కెట్ డైరెక్టర్ జానీపాషా ప్రవీణ్ రెడ్డి పవన్ రెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు

# ఐడి లిక్కర్ పట్టివేత..



ఇబ్రహీంపట్నం వెలుతురు ఏప్రిల్ 26:

ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ సుభాష్ చంద్ర సిబ్బంది కలిసి లోయపల్లి ప్రాంతాల్లో 15.25 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, రెండు వందల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఐదు కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్ తెలిపారు.

# హైదరాబాద్ వేదికగా కరాటే రంగంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్





- **గచ్చిబౌలి స్టేడియంలో కరాటే విన్యాసాల జోరు: గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను కైవసం చేసుకున్న క్రీడాకారులు**
- **10 రాష్ట్రాల నుండి 1212 మంది క్రీడాకారుల భాగస్వామ్యం**
- **ఏకకాలంలో 11 నిమిషాల పాటు అద్భుత ప్రదర్శన**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:

హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియం అరుదైన అంతర్జాతీయ ఘనతకు వేదికైంది. కరాటే రంగంలో తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, ఏకకాలంలో 1212 మంది క్రీడాకారులు ప్రదర్శన ఇచ్చి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నారు. జయంత్ రెడ్డి ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ, విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం నిర్వహించబడింది.

కేవలం 11 నిమిషాల వ్యవధిలో 1212 మంది కరాటే క్రీడాకారులు అత్యంత క్రమశిక్షణతో, ఏకధాటిగా తమ విన్యాసాలను ప్రదర్శించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా సుమారు 10 రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులు ఈ ఫీట్‌లో భాగస్వాములయ్యారు. ఈ తక్కువ సమయంలో లక్షలాది పంచులు (Punches), బ్లాక్స్ (Blocks) నమోదు కావడం విశేషం. గతంలో ఉన్న 8 నిమిషాల రికార్డును అధిగమిస్తూ, ఇంత భారీ సంఖ్యలో క్రీడాకారులు ఏకతాటిపైకి వచ్చి ఈ ఘనత సాధించడం ఇదే ప్రథమం. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధి స్వప్నిల్ ఈ కార్యక్రమానికి హాజరై ప్రదర్శనను నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "భారతదేశంలో కరాటే విభాగంలో ఇలాంటి భారీ రికార్డు నమోదు కావడం గర్వకారణం. 11 నిమిషాల పాటు 1212 మంది అత్యంత సమన్వయంతో చేసిన ఈ ప్రదర్శన అద్వితీయం" అని కొనియాడారు. అనంతరం నిర్వాహకులకు గిన్నిస్ రికార్డ్ ధృవీకరణ పత్రాన్ని అధికారికంగా అందజేశారు.

ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలోనే అతిపెద్ద కరాటే ప్రదర్శన (Largest Karate Display) నిర్వహించి, ప్రపంచ రికార్డు సాధించడం చాలా సంతోషంగా ఉందని, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారుల కృషి, పట్టుదలకు ఈ రికార్డు నిదర్శనమని, మార్షల్ ఆర్ట్స్ పట్ల అవగాహన పెంచడమే మా లక్ష్యమని," అని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో జయంత్ రెడ్డితో పాటు విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన మాస్టర్ విఠల్, సుమన్, శ్రీధర్, మహ్మద్ పాషా, ఖాజా ఆఫ్రిది, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. రికార్డు సాధించిన క్రీడాకారులను, వారి తల్లిదండ్రులను మరియు శిక్షకులను ఈ సందర్భంగా వారు అభినందించారు.

## శాసనమండలి సభ్యులుగా ఎన్నికైన ఎం. కోదండరాం



- **శుభాకాంక్షలు తెలియజేసిన టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.అశోక్**

రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 26:

తెలంగాణ జేఏసీ చైర్మన్ &.తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం కోదండరాం శాసనమండలి సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్ . అశోక్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసి. తెలంగాణ రాష్ట్రం సాధించటంలో కీలక భూమిక పోషించి అహర్నిశలు తెలంగాణ కోసం నిరంతరం పని చేస్తున్న తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ఎం కోదండరాం ను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర క్యాబినెట్ ఎమ్మెల్సీగా ఎన్నిక చేసి ఆమోదం చేసి గవర్నర్కు పంపగా నిన్న గవర్నర్ ఆమోదంతో,శాసనమండలికి మరోసారి ఎన్నికై మా గురువర్యులకు మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం కి ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం అనేక విషయాలు చర్చించడం జరిగింది. అంచలంచలుగా సమస్యలను పరిష్కారం చేస్తానని ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల విద్యార్థి సంఘ నాయకులు రామన్నపేట మండల అధ్యక్షులు గడ్డం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి : కాల్వ సుజాత



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 26:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రగతినగర్‌లో వాసవి మాత జయంతి సందర్భంగా శ్రీ వాసవి సేవక్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. వాసవి సేవక్ ఫౌండర్, చైర్మన్ అల్లాడి మహేష్‌గుప్తా ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్రా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత మరియు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా హన్మంత్ రెడ్డి నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ... సమాజ సేవలో వాసవి సేవక్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులు ఐకమత్యంతో పనిచేస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో వాసవి సేవక్ కమిటీ సభ్యులు మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

## శ్రీశ్రీ సురమాంబ సమేత కాటా మహేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

- **హాజరైన మాజీ ఎమ్మెల్యే**
- **చిరుమర్తి లింగయ్య**

రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 26:



మండలం సిరిపురం గ్రామంలో ఘనంగా నిర్వహించిన శ్రీశ్రీశ్రీ సురమాంబ సమేత కాటమహేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం సిరిపురం సర్పంచ్ అంబటి ఉపేంద్రమ్మ, రవీందర్ రెడ్డి ఇంద్రపాల్ నగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్ మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం గ్రామ శాఖ అధ్యక్షుడు బండ శ్రీనివాస్ రెడ్డి మండల బీసీ సెల్ అధ్యక్షుడు కూనూరు ముత్తయ్య వార్డు మెంబర్లు కట్ట సతీష్ రెడ్డి గాదె శంకర్, కూనూరు రమేష్ నాయకులు కూనూరు లింగస్వామి, గాదె రామచంద్రం, స్వామి, యాదయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

## స్త్రీ యొక్క ఆత్మ అభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని ఈ సృష్టికి తెలియజేసిన అమ్మవారు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి

- **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్.**

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 26:



ఆదివారం 128 చింతల్ డివిజన్ హెచ్ఎంటి కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చింతల్, కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జూలూరి విజయకుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి మహంకాళి ప్రభు రాజ్, ఇల్లందుల కృష్ణ, వాడగూరి రాజు, ఉపాధ్యక్షులు సిహెచ్. శ్రీనివాస్, వీరేంద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య




రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 26:

వెల్లంకి గ్రామానికి చెందిన నన్నూరి రవీందర్ రెడ్డి గారి కుమారుల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవానికి నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య హాజరై చిన్నారులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు సర్పంచులు ఈడం రాధా, శ్రీనివాస్, గర్దాస్ విక్రమ్, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి జిల్లా నాయకులు ఎస్.కె చాంద్ గ్రామ కార్యదర్శి పిట్ట మహేందర్ రెడ్డి నాయకులు ఎడ్ల నరేందర్ రెడ్డి, ఎడ్ల కృష్ణారెడ్డి, పాశం సతీష్‌రెడ్డి, బొలుగుల కృష్ణ, బొడ్డుపల్లి రాజు, వర్కల రమేష్, కొమ్ము రాము తదితరులు పాల్గొనడం జరిగింది.

# నేటి నుండి ఉప్పల్ రింగ్ రోడ్ బంద్

- **ఫ్లైఓవర్ పనుల దృశ్యా తాత్కాలిక ఆంక్షలు విధిస్తున్నట్లు ప్రకటించిన అధికారులు**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:



ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద హన్మకొండ వైపు వెళ్ళే బస్సులు ఆగే బస్టాండ్‌ను నల్లచెరువు వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌కు మార్చినట్లు, నేటి నుండి అక్కడే బస్సులు ఆగుతాయని అధికారుల ప్రకటన

బోడుప్పల్ వైపు నుండి వచ్చే వాహనాలు ఏషియన్ థియేటర్ వద్ద నుండి భగాయత్ లేఅవుట్ ద్వారా నాగోల్ చేరుకోవాలని సూచన

సికింద్రాబాద్ నుండి వరంగల్ వైపు వెళ్లే భారీ వాహనాలు హబ్సిగూడ నుండి నాచారం ద్వారా చెంగిచర్ల చేరుకుని అక్కడి నుండి జాతీయ రహదారి చేరుకోవాలని, చిన్న వాహనాలు లిటిల్ ఫ్లవర్ స్కూల్ వెనుక నుండి రహదారికి చేరుకోవాలని సూచనలు

నిత్యం అత్యంత రద్దీగా ఉండే ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద ట్రాఫిక్ ఆంక్షలు ఎన్ని రోజులు ఉంటాయో, పనులు ఎన్నటికి పూర్తి చేస్తారోనని ఆందోళనలో వాహనదారులు

## బెల్లం పట్టివేత..



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:

బేగం బజార్ నుంచి కలువుకుర్తి ప్రాంతానికి ఆటోలో రవాణా అవుతున్న 360 కేజీల బెల్లం 90 కేజీల ఆలం 10 లీటర్ల ఐడి లిక్కర్ను ఎస్టిఎఫ్ ఏ టీం అంజిరెడ్డి సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో ఆటో సీడ్ చేసి మేఘావత్ గణేశుని అరెస్ట్ చేసి అరెస్ట్ చేశారు.

బెల్లం ఆటోను నిందితున్ని కల్వకుర్తి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్టిఎఫ్ టీం లీడర్ అంజి రెడ్డి తెలిపారు.

# అధికారాన్ని అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్‌లో చేరమని ఒత్తిడి

- **మారకపోతే మునుగోడు మండలం పలివెల గ్రామంలో 72 లక్షల అవినీతి ఆరోపణలు**

**మునుగోడు , ఏప్రిల్ 26 (వెలుతురు):**

దేఅధికారాన్ని, అధికారులను అడ్డుపెట్టుకుని ఒక బీసీ మహిళా సర్పంచిని మరియు ఆమె భర్త మాజీ సర్పంచి గజ్జల బాలరాజు పై, వ్యక్తిగతంగా నాపై జరుగుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో గ్రామపంచాయతీ వ్యవస్థలో ఏ పని చేయాలన్నా పాలకవర్గం తీర్మానం తప్పనిసరి కాగా, సర్పంచ్ మరియు ఉపసర్పంచ్‌లకు జాయింట్ చెక్ పవర్ ఉండేది. గ్రామ కార్యదర్శి పనులను పర్యవేక్షించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వడం, అలాగే ఏఈ, డిఈ మరియు క్వాలిటీ కంట్రోల్ టీమ్ పర్యవేక్షణలోనే బిల్లులు విడుదల కావడం వంటి వ్యవస్థలు పారదర్శకతకు దోహదం చేశాయి. ఇలాంటి స్పష్టమైన విధానాలు ఉన్నప్పటికీ, ఏ గ్రామపంచాయతీలోనైనా అవకతవకలు జరిగాయని ఆరోపించాలంటే ముందుగా సంబంధిత పాలకవర్గం మరియు అధికారులపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు నిర్ధారించడం అవసరం. కానీ పలివెల గ్రామంలో అలాంటి నిర్ధారణ లేకుండానే, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఒక బీసీ మహిళా సర్పంచిని లక్ష్యంగా చేసుకుని వార్తలు ప్రచారం చేయడం, ఆమెను మరియు ఆమె కుటుంబాన్ని కించపరచడం

కాబట్టి, ఎవరిపై అయినా ఆరోపణలు చేయాలంటే అవి ఆధారాలతో అధికారుల ముందుంచాలి. ప్రతిరోజూ పత్రికల్లో ప్రచారం చేస్తూ వ్యక్తులను కించపరచడం సమాజానికి మంచిది కాదు. తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత కాగా,




వ్యక్తిగతంగా తీర్పులు ఇవ్వడం లేదా ఒత్తిళ్లు తీసుకురావడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. సమాజంలో న్యాయం, పారదర్శకత నిలవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించడం అవసరం. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మందుల సత్యం, ఉకొండి సర్పంచ్ పోలగోని సైదులు గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల సంయుక్త కార్యదర్శి మదనబోయిన పరమేష్, మేకల శ్రీనివాస్ రెడ్డి, మారగొని అంజయ్య, కొండవీటి మోహన్ రెడ్డి, కొండవీటి రాంరెడ్డి, వార్డ్ మెంబర్ బత్తుల శేఖర్, మాజీ వార్డ్ మెంబర్ నాతి లింగస్వామి, పనస మురళి గౌడ్, కొండవీటి శ్రీనివాస్ రెడ్డి, మార్త మోహన్ రెడ్డి, నాతి పెద్ద స్వామి, బత్తుల సైదులు, పలివెల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి

- **సిపిఐ జాతీయ కార్యదర్శి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి**

**చౌటుప్పల్ , ఏప్రిల్ 26 (వెలుతురు):**

మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లోని కరువు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు సాగు, త్రాగునీరు అందించేందుకు డిండి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేసి 3 లక్షల 61 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ లో ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి తో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, జీవో నెంబర్ 107 విడుదల చేసి 11062015 తేదీన చర్లగూడెం వద్ద గత ప్రభుత్వం డిండి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారని తెలిపారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల పరిధిలోని



సుమారు 3 లక్షల 41 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే విధంగా సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాంపల్లి , చర్లగూడెం, రిజర్వాయర్ల నిర్మాణం జరుగుతున్నాయి కానీ ఈ ప్రాజెక్టు విషయమై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొని ఉన్నదని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన ఏదుల్లా రిజర్వాయర్ నుండి రోజుకు 0.5 టీఎంసీల చొప్పున 60 రోజుల పాటు 30 టీఎంసీలు నీటిని తీసుకునే విధంగా డిండి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అవసరమైనన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. నల్లగొండ జిల్లాలో సుమారు 3 లక్షల 41 వేల ఎకరాలకు సాగునీరు వందల గ్రామాలకు త్రాగునీరు ఇచ్చే శ్రీశైలం సొరంగం పనులు పూర్తి చేసేందుకు గత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం వలన నిర్మాణ వ్యయం పెరిగిందన్నారు. ఇంకా 9.5 కిలోమీటర్లు సొరంగం తవ్వాల్సి ఉందని ఈ బడ్జెట్లో కేటాయించిన రూ. 800 కోట్లు సరిపోవని అన్నారు. పూర్తి నిధులు ఇచ్చి త్వరితగతిన పూర్తి చేయుటకు పర్యవేక్షణ కమిటీని వేయాలని కోరారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టులపై పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. ఈ ప్రభుత్వ హయాంలోనైనా ఫ్లోరిడ్ పీడత కరువు, కాటకాలతో ఉన్న నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేయడానికి డిండి ఎత్తిపోతల పథకం, శ్రీశైల సొరంగ మార్గాన్ని తక్షణమే పూర్తి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, చర్లగూడెం ప్రాజెక్టు నుండి లిఫ్ట్ ద్వారా రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటుచేసి నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగునీరు అందించే విధంగా ఈ ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి,చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సిపిఐ నాయకులు బద్దుల సుధాకర్, రొండి నరసింహ, కొండూరు వెంకటేష్, టంగుటూరి రాములు, దాసరి మనోహర్, శనిగల వెంకటేష్, సికిల్ మెట్ల రమేష్, కొత్త వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**భువనగిరి ఏప్రిల్, 26 (వెలుతురు న్యూస్ ):** భువనగిరి నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను తగ్గించి యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ, సామాజిక బాధ్యతగా యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ భారీ జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మే 8, 9, 10 తేదీలలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ హైస్కూల్ ప్రాంగణంలో ఈ జాబ్ మేళా నిర్వహించబడనుంది. భువనగిరి నియోజకవర్గంతో పాటు పరిసర



ప్రాంతాల యువత కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మెగా జాబ్ మేళాలో దేశవ్యాప్తంగా ప్రముఖ కంపెనీలు పలు రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నాయి. సుమారు 20కి పైగా సంస్థలు పాల్గొని 3500కి పైగా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

**అర్హతలు: 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ ఇంజనీరింగ్ ఇతర టెక్నికల్ అర్హతలు**

**జీతం: 12,000 నుండి 40,000 వరకు (అర్హతలు, నైపుణ్యాల ఆధారంగా)**

యువత స్వయం ఆధారితంగా ఎదగాలంటే ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకోవడం అవసరమని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా వేలాది మంది యువతకు నేరుగా ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని తెలిపారు. అభ్యర్థులు తమ రిజ్యూమ్, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు మరియు విద్యార్హతల సర్టిఫికెట్లు తీసుకొని హాజరు కావాలని సూచించారు. ముందస్తు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. భువనగిరి నియోజకవర్గాన్ని ఉపాధి అవకాశాల కేంద్రంగా అభివృద్ధి చేయడం, నిరుద్యోగ యువతకు స్థిరమైన జీవనోపాధి కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్, జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్, మున్సిపల్ చైర్మన్, సీనియర్ నాయకులు, మండల మరియు గ్రామాల ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. చివరిగా, యువత భారీ సంఖ్యలో పాల్గొని ఈ మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారు చూపిన బాటలో ముందుకు సాగుదాం

- **ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**
- **యాదగిరిగుట్టలో ఘనంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన ఉత్సవాలు**

**యాదగిరిగుట్ట , ఏప్రిల్ 26 (వెలుతురు):**

జగద్గురువులు, మహా సంఘసంస్కర్త , తన కాలజ్ఞానంతో మానవాళికి అంతటికి జ్ఞాన బోధ చేసిన త్రిమూర్తుల అంశా స్వరూపులు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 333 వ దివ్య ఆరాధన ఉత్సవాలు, పంచ బ్రహ్మ యజ్ఞ మహోత్సవాలు యాదగిరిగుట్టలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షులు వడ్లోజు మన్మధ చారి, శివకోటి వీరస్వామి ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారు సూచించిన బాటలో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని అన్నారు . ఆయన ఆధ్యాత్మిక బాటలో మనమంతా ముందుకు నడవాలని అన్నారు . ఆయన ఈ సమాజానికి ఎన్నో అనేక సందేశాలు ఇచ్చారని, తన కాలజ్ఞానంతో భవిష్యత్తును ఊహించి చెప్పారని అన్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వారు మనందరికీ ఆరాధ్య దైవం అని అన్నారు . ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక హోమంలో విశేష పూజలలో బీర్ల దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీర్ల దంపతులను ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఘనంగా శాలువాలు పూలమాలలతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు అదే విధంగా యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ దంపతులను భువనగిరి మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ దంపతులను ఉత్సవ కమిటీ నిర్వాహకులు శాలువాలు పూలమాలలతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందించారు. అంతకుముందు వైకుంఠ ద్వారం నుండి కార్యస్థలం వరకు ఊరేగింపు నిర్వహించి కార్యాస్థలంలో ధ్వజారోహణ సర్వదేవత ఆహ్వానము అంకురార్పణం జ్యోతి ప్రజ్వలన గణపతి పూజ విశ్వకర్మ భగవాన్ గాయత్రి మాత పూజ తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు అనంతరం వేదమూర్తులచే మహదాశీర్వచనము, భక్తులకు ప్రసాద వితరణ అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం పలువురు అతిథులు, దాతలను శాలువాలు పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వడ్లోజు మన్మధ చారి , శివకోటి వీరస్వామి , టీటీడీ లోకల్ అడ్వైజరీ బోర్డు మాజీ సభ్యులు వడ్లోజు వెంకటేష్, సంఘం అధ్యక్షులు కందుకూరి నాగభూషణం , తంగళ్ళపల్లి సుగుణాకర్ , అన్న ప్రసాద్ దాత టి ఆర్ రఘు చారి, జనగాం రత్నయ చారి , చెన్నోజు భగవంతాచారి, చెన్నోజు శ్రీనివాస్ చారి , పోలోజు వెంకటేష్ చారి, శివకోటి భాస్కర్ , కందుకూరి నరసింహ చారి , కందుకూరి రాములు , చెన్నోజు శ్రీనివాస చారి, కోనాపురం వెంకటేష్, అక్కెనపల్లి అశోక్ చారి , పద్మనాభం శివకుమార్ , వడ్లోజు శ్రీధర్ చారి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వధూవరులను ఆశీర్వదించిన ధనవత్ శంకర్ నాయక్

**యాదగిరిగుట్ట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 26 :**

ఆదివారం రోజు తుర్కపల్లి మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కార్యదర్శి బోయిని సరిత పాండు గార్ల కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధనవత్ శంకర్ నాయక్ , ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ వర్కింగ్



ప్రెసిడెంట్ ,కోనాపురం సర్పంచ్ ,సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, జిల్లా సర్పంచ్ల ఫోరం ప్రచార కార్యదర్శి చొక్ల తండా సర్పంచ్ భూక్య రాజారామ్, మండల ఓబీసీ అధ్యక్షులు రామగోని వెంకటేష్ గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వల్లెపు రమేష్ , తిరుమలాపురం మాజీ ఉపసర్పంచ్ సముద్రాల వెంకటేష్ తదితరులు పాల్గొని ఆశీర్వదించడం జరిగింది.

## శ్రీ మద్విరాట్ వీరబ్రహేంద్రస్వాముల కళ్యాణం –ఆరాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్



**భువనగిరి ఏప్రిల్, 26 (వెలుతురు న్యూస్ ):** భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదివారం రోజున భువనగిరి పట్టణంలోని నల్గొండ చౌరస్తా వద్ద గల హనుమాన్ దేవాలయం ఆవరణలోని బ్రహ్మంగారి దేవాలయంలో నిర్వహించిన శ్రీ మద్విరాట్ వీరబ్రహేంద్ర స్వాముల వారి కళ్యాణం మరియు ఆరాధన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు..అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి మహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల శ్రేయస్సు, ప్రాంత అభివృద్ధి కోసం స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

ఈ వేడుకలో భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్, భువనగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు , కౌన్సిలర్లు,మండల ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహక కమిటి సభ్యులు , భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రోడ్డును ఆక్రమించి, రోడ్డుపైన ఇల్లుకడుతున్న వారి పై చర్యలు తీసుకువాలి

**భువనగిరి, ఏప్రిల్ 26 (వెలుతురు న్యూస్ ):** కామకుంట్ల సురేష్, తండ్రి: బిక్షపతి, నివాసం: సీతానగర్ కాలని వాస్తవ్యుడు సదరు వ్యక్తి తన స్థలమునకు ఉన్న హద్దులు మీరి రోడ్డు మీదకు వచ్చి రోడ్డును ఆక్రమించి, రోడ్డుపైన ఇల్లుకడుతున్న సదరు కామకుంట్ల సురేష్ గారిపై చర్యలు తీసుకొని, అట్టి అక్రమ నిర్మాణమును కూల్చివేయుట గురించి విషయానుసారముగా మేము అనగా యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి టౌన్లోని, సీతానగర్ కాలనికి చెందిన ప్రజలమైన మేము తమరికి వ్రాసుకునే విన్నపము ఏమనగా! మా సీతానగర్ కాలనికి చెందిన కామకుంట్ల సురేష్, తండ్రి: బిక్షపతి అనే వ్యక్తి తనకుండబడిన ఖాళీస్తలమునకు సంబందించిన హద్దులను వదిలివేసి, రోడ్డు మీదనే పిల్లర్లు వేసి సగం రోడ్డును ఆక్రమించి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. దాంతో మా సీతానగర్ కాలని వాసులందరు సదరు వ్యక్తిని నిలదీయగా మీ దిక్కు ఉన్నచోట చెప్పుకోండి, నన్ను ఎవ్వరు ఏమి చేయలేరు అని అంటున్నారు. దాంతో మేము అట్టి అక్రమ నిర్మాణ గృహమును కూల్చివేయమని మున్సిపల్ కమీషనర్ యాదాద్రి భువనగిరి గారికి వినతి పత్రం ఇవ్వగా, వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ఇంతవరకు కామకుంట్ల సురేష్ గారిపై ఎలాంటి



చర్యలు తీసుకోలేదు. దాంతో కామకుంట్ల సురేష్ అట్టి అక్రమ నిర్మాణమును ఆపకుండా సగం రోడ్డు మీదకు వచ్చి ఇల్లును కట్టుచున్నాడు. దీని వలన మా సీతానగర్ కాలని ప్రజలకు రోడ్డు వసతి లేక, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీని వలన అట్టి రోడ్డుపై కనీసం ఆటో కూడా తిరగలేని పరిస్థితి నెలకొని ఉంది. కావున దయామయులైన తమరు మా యందు దయతలచి ఇట్టి విషయంపై పూర్తిస్థాయి విచారణ జరిపించి తక్షణమే కామకుంట్ల సురేష్ రోడ్డు పై కడుతున్న అట్టి అక్రమ నిర్మాణమును కూల్చివేసి మా సీతానగర్ కాలనివాసులకు సరైన న్యాయం చేయగలరని మా యొక్క ప్రార్థన, తాటికాయల విజయలక్ష్మి, బొజ్జ స్వామి బొజ్జ లింగం, రఘు బొజ్జ సుమలత, లైక్ అలీ రామచందర్, షేక్ యాకుబ్.

## ఆలేరు మండల, పట్టణ వైశ్య సంఘం ఆధ్వర్యంలో సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం

**యాదగిరిగుట్ట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 26 :** తెలంగాణ ప్రభుత్వం వాసవి మాత జయంతి ని అధికారిక ఉత్సవముగా ప్రకటించించినదుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆలేరు మండల మరియు పట్టణ వైశ్య సంఘం ఆధ్వర్యంలో సి.ఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేసారు, ఈ సందర్బంగా సంఘం మండల అధ్యక్షులు కొలనుపాక వార్డు మెంబర్ నాగబండి మధుసూదన్ మాట్లాడుతూ సి.ఏం రేవంత్ రెడ్డి కి వైశ్యలు రుణపడి ఉన్నారని ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాకుండా వాసవి మాత జయంతి ని అధికారిక ఉత్చవంగా ప్రకటించి వైశ్యుల మనుసు గెలుచుకున్నరన్నారనీ అన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ సముద్రాల సత్యం, సంఘం నాయకులు చొళ్ళేటి ప్రకాష్,




గందె అంజయ్య, సముద్రాల శ్రీనివాస్(oil), పొద్దుటూరి ఉపేందర్,మంచన మల్లేశం,బెలిదె కాశినాథ్, మంతపురి వెంకటేష్, తోట ప్రశాంత్, సరాబ్ లక్ష్మణ్, సముద్రాల రవి,నాగబండి నాగేందర్,చొళ్ళేటి రాజేష్, చొళ్ళేటి నాగయ్య, బెలిదె సంతోష్,గోరెంటి ఉపేందర్, పద్మ ప్రవీణ్, బచ్చు మణికంఠ మరియు సంఘం సభ్యులు పెద్ద

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చిత్రపటానికి పాలాభిషేకం



**యాదగిరిగుట్ట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 26 :** తెలంగాణ రాష్ట్రంలోకనీ ,విని ఎరుగని రీతిలో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో కార్మిక లోకానికి మంచి జరుగుతుందని మరోసారి రుజువు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి చిత్రపటానికి, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ఆదేశానుసారం పాలాభిషేకం చేసి, ఆర్టీసీ సిబ్బందికి ఐ.ఎన్.టి.యు.సి ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేయడం జరిగింది . యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలేటి అనిల్. ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ చైర్మన్ ,ఆలేరు మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పట్టణ మండల అధ్యక్షులు సీనియర్ మహిళా నాయకులు యువజన విద్యార్థి నాయకులు కార్మిక సంఘ నాయకులు సేవాదళ్ నాయకులు సీనియర్ నాయకులు ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ వాస్తు శిల్పి టి.ఆర్ రఘు సేవలు

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:**

ప్రముఖ వాస్తు శిల్పి, హస్త సాముద్రిక వేత్త, ఆధ్యాత్మికవేత్త టీఆర్ రఘు సేవలు అమోఘమని పలువురు అతిథులు కొనియాడారు . ఆదివారం ప్రముఖ వాస్తు శిల్పి టి ఆర్ రఘు దంపతులను ప్రత్యేకంగా, ఆత్మీయ సత్కారం చేశారు . ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ టీఆర్ రఘు వాస్తు శిల్పిగా అనేక అద్భుతమైన నిర్మాణాలను 100% వాస్తుతో అమోఘంగా నిర్మింప చేస్తున్నారని అన్నారు . వారి వాస్తు శిల్ప కళ నైపుణ్యం అద్భుతం అని అన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్తగా సామాజిక సేవకులుగా ఆయన చేస్తున్న సేవలు అద్భుతం అని అన్నారు. టి ఆర్ రఘును ఆదర్శంగా తీసుకొని నేటి యువత ఆధ్యాత్మిక సామాజిక సేవలో ముందుకు సాగాలని అన్నారు. ప్రముఖ వాస్తు శిల్పి , ఆధ్యాత్మికవేత్త దివంగత టీఎస్ రాజశేఖర్ తనయుడిగా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆయన స్ఫూర్తిని ఆయన అందించిన సందేశాన్ని సమాజానికి అందిస్తున్న మంచి మనసున్న వ్యక్తి టీఆర్ రఘు అని అన్నారు. ఈ సందర్భంగా టి.ఆర్ రఘును స్థానికంగా పలువురు ప్రముఖులు పూలమాలలు , శాలువాలతో ఘనంగా సత్కరించారు అనంతరం ప్రముఖ వాస్తు శిల్పి టి ఆర్ రఘు మాట్లాడుతూ తనను అభిమానంతో సత్కరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. కృష్ణ శిలలతో అద్భుతంగా పునర్నిర్మితమైన మహా పుణ్యక్షేత్రమైన యాదాద్రిలో విశ్వకర్మ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయం నిర్మాణం చేయాలనేది తన తండ్రి గారి ఆశయం అని అన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తానని అన్నారు భవిష్యత్తులో నిర్మించబోయే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయానికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని ప్రకటించారు . ఈ సందర్భంగా ఆయన విశ్వబ్రాహ్మణులకు, అతిధులకు భక్తులకు ప్రత్యేకంగా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.



# హిందూధర్మం అంటే మతం కాదు, జీవన విధానం

- **ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంఘచాలక్ ఎలగందల సత్యనారాయణ**

**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 26:** హిందూధర్మం అంటే మతం కాదు, జీవన విధానం అని ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంఘచాలక్ ఎలగందల సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ ఉప మండలం ,శ్రీరామ హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంఘచాలక్ ఎలగందల సత్యనారాయణ మాట్లాడుతూ హిందూ ధర్మం , సనాతన ధర్మం కు శాశ్వత చిరునామా భారతదేశమే అన్నారు. అందుకే ప్రపంచ దేశాల్లో అన్నింటికంటే భారత దేశానికి ఓ ప్రత్యేకత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ హిందూ సంస్కృతి సంప్రదాయాలుకాపాడుకోవాలన్నారు. దేశ ప్రగతికి సత్యం, ధర్మం వంటి విలువలను ఆచరించడం అవసరమని తెలిపారు. పంచ పరివర్తనల ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందని , ఆ దిశగా ముందుకు కొనసాగాలని తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. హిందూ సమాజం ఐక్యత తో ఉండాలన్నారు. హిందూ ధర్మ రక్షణ, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి నడుం బిగించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. హిందూ సమ్మేళన సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హిందూ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ అల్పాహారం, మజ్జిగ ను అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు సరఫ్ రామకృష్ణ, గర్రెపల్లి మహేశ్వర శర్మ అయ్యగారు , మహిళా వక్త అనుపమ లతో పాటు సదాశివ పల్లి, మానకొండూర్ , ముంజంపల్లి, శ్రీనివాస్ నగర్, జగ్గయ్యపల్లి, లింగాపూర్, ఈదులగట్టపల్లి,గ్రామాల హిందూ బంధువులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.






# ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు

- **ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో వేడుకలు...**
- **అభిషేకం, కుంకుమార్చన, అన్నప్రసాద వితరణ నిర్వహణ...**

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 27:** ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు స్థానికంగా భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించగా, అనంతరం సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లలిత సహస్రనామ పారాయణం భక్తి పారవశ్యంతో సాగింది. తరువాత అమ్మవారికి డోలారోహణం నిర్వహించి మహా హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో సర్వలోకాలకు శాంతి, సుఖ సమృద్ధి కలగాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం నిండాలని భక్తులు ప్రార్థించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెజుగం రాజ్ గోపాల్, ప్రధాన కార్యదర్శి నామ రవికిరణ్, ఉపాధ్యక్షుడు పాండయ్యతో పాటు కార్యవర్గ సభ్యులు, పట్టణ ప్రముఖులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# సాయిబాబా ఆలయంలో ఘనంగా వాసవి మాత జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

- **ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి**
  **నారాయణఖేడ్ వెలుతురు, ఏప్రిల్ 26:**

సంగారెడ్డి జిల్లా : నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఆదివారం వాసవి మాత జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం, అహింసా మార్గాన్ని ప్రబోధించిన ఆర్యవైశ్య కులదైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందుంటారని, వాసవి మాత చూపిన ధర్మ మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ కమిటీ వారు ఎమ్మెల్యే గారిని ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, పట్టణ ప్రముఖులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి – నిందితుడిపై కేసు నమోదు

- **విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై అకారణంగా దాడి చేసి, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై నల్గొండ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.**
  **నల్లగొండ వెలుతురు ఏప్రిల్ 26:**

**సంఘటన వివరాలు:** నల్గొండ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్జాలబావి గ్రామ సమీపంలో గల ఐటీ హబ్ (IT Hub) వద్ద ఆదివారం ఉదయం సుమారు 08:10 గంటల సమయంలో ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు డ్రైవర్ తల్లా రామ్ కుమార్ బస్సును నిర్ణీత స్టాప్ వద్ద నిలిపారు. ఆ సమయంలో తన బైక్‌పై (TS05FJ9301) వచ్చిన తుపాకుల వెంకటేశం అనే వ్యక్తి, బస్సును మధ్యలో ఎందుకు ఆపలేదని డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. బస్సును కేవలం నిర్దేశించిన స్టాపుల వద్దే ఆపుతామని డ్రైవర్ రామ్ కుమార్ చెప్పినప్పటికీ నిందితుడు వెంకటేశం డ్రైవర్‌ను అసభ్య పదజాలంతో దూషించాడు. అనంతరం బస్సులోకి ప్రవేశించి డ్రైవర్‌ను సీటులో నుండి కిందకు లాగి విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో డ్రైవర్ రామ్ కుమార్ కుడి కంటి పైన మరియు మోకాలికి గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో బాధితుడు రామ్ కుమార్ ఫిర్యాదు మేరకు నల్గొండ రూరల్ SI. సైదా బాబు నిందితుడు తుపాకుల వెంకటేశంపై బిఎన్ఎస్ (BNS) సెక్షన్లు 118(1), 352 కింద కేసు (FIR No. 90/2026) నమోదు చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల విధినిర్వహణకు ఆటంకం కలిగిస్తూ వారిపై భౌతిక దాడులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి హెచ్చరించారు. ఆర్టీసీ సిబ్బందికి అండగా ఉండి వారి రక్షణే తమధ్యేయమని నాగిరెడ్డి చెప్పారు.



# రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాన్ని స్వాగతించిన సీనియర్ నాయకులు కె ప్రసాద్ రెడ్డి

- **పిఏసిఎస్ చైర్మన్ లను నామినేటెడ్ చెయ్యడంపై హర్షం..**
  **|జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:**

గత రెండు రోజుల క్రితం రాష్ట్ర క్యాబినెట్ గతంలో ఉన్న ఎన్నిక విధానాన్ని రద్దు చేస్తూ రైతులకు నేరుగా నామినేట్ చెయ్యాలని నిర్ణయం తీసుకోవడంపై నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, ప్రముఖ పారిశ్రమిక వేత్త కుడిముస్కుల ప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే సహకార బ్యాంక్ లు పటిష్టంగా ఉన్నాయని, నాటి కేంద్రంలోని వి పి సింగ్ ప్రభుత్వం నుండి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం వరకు చుస్తే సొసైటీలను మొదటి ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేశారాని, 2023 తెలంగాణా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే సహకార బ్యాంక్ లోని రైతులకు సంబందించిన 2 లక్షల రుణాలను మాఫీ చెయ్యడమే కాకుండా రైతులకు తిరిగి రుణాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు. రైతులకు నేరుగా నామినేట్ చెయ్యడం వల్ల ఎన్నికల ఖర్చు భారం తగ్గిపోయి అనుభవంతో కూడిన పాలకవర్గాన్ని ప్రభుత్వం ఎన్నుకొంటుందని తెలిపారు.



# ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమిపూజ



- **సర్పంచ్ రాజ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభం...**
- **అర్హులందరికీ శాశ్వత నివాసమే ప్రభుత్వ లక్ష్యం...**
- **లబ్ధిదారుల ఆనందం – సీఎం పట్ల కృతజ్ఞతలు....**

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:**

అర్హులైన ప్రతి ఒక్కరికి శాశ్వత నివాసాన్ని కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతోందని మనియార్పల్లి గ్రామ సర్పంచ్ బ్యాగారి రాజ్ కుమార్ తెలిపారు. ఆదివారం కోహిర్ మండలం మనియార్పల్లి తండాలో ఆంగోత్ లలితాబాయి-ఆంగోత్ రవి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరవడంతో ఇంటి నిర్మాణ పనులకు సర్పంచ్ చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదలకు ఇల్లు కట్టుకునే అవకాశం కల్పిస్తూ వారి కలలను నెరవేర్చడంలో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమంతో అనేక కుటుంబాలకు శాశ్వత నివాసం అందుతుందని తెలిపారు. గతంలో పదేళ్ల పాటు ఇల్లు మంజూరు కాని పరిస్థితులు ఉన్నాయని విమర్శించారు.
ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తోందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తూ... తమకు ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ పెద్దగా బాధ్యత తీసుకొని ఐదు లక్షల రూపాయలతో ఇల్లు నిర్మాణం ప్రారంభించడం తమకు ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఎప్పటికీ రుణపడి ఉంటామని తెలిపారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి




- **మండల పరిధిలోని తుర్కొనిబావి–లచుగూడెం స్టేజ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం తుర్కొనిబావి గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.**
- **కనగల్ వెలుతురు ఏప్రిల్ 26:**

మండల పరిధిలోని తుర్కొనిబావి-లచుగూడెం స్టేజ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం తుర్కొనిబావి గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గ్రామానికి చెందిన పెరిక అంజయ్య తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కనగల్ ఎస్సై కే.రాజీవ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో అంజయ్య నల్గొండలోని ఆస్పత్రికి వెళ్లేందుకు లచుగూడెం స్టేజ్ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ సమయంలో దేవరకొండ నుంచి నల్గొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆపేందుకు ప్రయత్నించాడు. అయితే బస్సు డ్రైవర్ వాహనాన్ని నిలపకపోవడంతో, బస్సును ఆపేందుకు అంజయ్య రోడ్డు పైకి ముందుకు వెళ్లాడు. అదే సమయంలో డ్రైవర్ సమయానికి బ్రేకులు వేయలేకపోవడంతో బస్సు అంజయ్యను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంజయ్య తలకు వెనుక భాగంలో తీవ్ర గాయాలు కాగా, నోటి మీదుగా రక్తస్రావం జరిగింది. వెంటనే స్థానికులు స్పందించి 108 అంబులెన్స్ ద్వారా నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నల్గొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం ఉదయం 10:30 గంటలకు అంజయ్య కన్నుమూశాడు. మృతుని భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బస్సు డ్రైవర్ దేవరకొండ ప్రాంతానికి చెందిన సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అంజయ్య మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు.

# ఏపీలో బంకుల బంద్ ప్రభావం.. కిలోమీటర్ల క్యూలు

- - అవసరానికి మించి నిల్వ చేసుకుంటున్న ప్రజలు
- - ప్యానిక్ బయింగ్‌తో ఖాళీ అవుతున్న నిల్వలు
- - డీజిల్ దొరక్క అల్లాడుతున్న రైతులు
- - ప్లాస్టిక్ డ్రమ్ములు, వాటర్ క్యాన్‌లతో బంకులకు జనం
- - పలు జిల్లాల్లో మిన్నంటిన ఇంధన కష్టాలు
- - విజయవాడలో పెట్రోల్ విక్రయాలపై ఆంక్షలు
- - ఒక వాహనానికి రూ. 200 మాత్రమే
- - సమస్యల పరిష్కారానికి పర్యవేక్షణ పెంచిన కలెక్టర్లు




**అమరావతి వెలుతురు ఏప్రిల్ 26:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరాలో తలెత్తిన కొరత ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. శుక్రవారం రాత్రి మొదలైన ఈ ఇంధన కష్టాలు ఆదివారం నాటికి పరాకాష్టకు చేరుకున్నాయి. రాష్ట్రంలోని మెజారిటీ పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉన్నచోట నిల్వలు అయిపోతాయనే భయంతో జనం గంటల తరబడి క్యూలైన్లలో పడిగాపులు కాస్తున్నారు. ఎండ తీవ్రతను కూడా లెక్కచేయకుండా వాహనాలు పక్కన పెట్టి, ప్లాస్టిక్ డబ్బాలు, డ్రమ్ములు, వాటర్ క్యాన్‌లతో చమురు కోసం బంకుల వైపు పరుగులు తీస్తున్నారు. చాలా చోట్ల నిర్వాహకులు నిల్వలు లేవని స్పష్టం చేయడంతో వాహనదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో స్టాక్ ఉన్నచోట ట్రాఫిక్ జామ్ కావడం వల్ల రాకపోకలు స్తంభించిపోతున్నాయి. చమురు కంపెనీల సరఫరాలో లోపాలు, ప్యానిక్ కొనుగోళ్ల కారణంగా డిమాండ్ అకస్మాత్తుగా పెరగడం ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు మరియు రవాణా రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరి కోత యంత్రాలు, ఆక్వా సాగులో వినియోగించే ఏరియేటర్లకు డీజిల్ దొరకక రైతులు ఆందోళన చెందుతున్నారు. కోనసీమ ప్రాంతంతో పాటు గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. వరి ధాన్యం రవాణాకు మరియు సాగు అవసరాలకు డీజిల్ తప్పనిసరి కావడంతో రైతులు బంకుల వద్ద కిలోమీటర్ల మేర బారులు తీరుతున్నారు. పరిస్థితిని గమనించిన కోనసీమ జిల్లా కలెక్టర్, రైతులెవరూ ఆందోళన చెందవద్దని, యంత్రాలకు డీజిల్ పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విజయవాడ నగరంలో ఇంధన లభ్యతను దృష్టిలో ఉంచుకుని, వాహనానికి కేవలం 200 రూపాయలకే పెట్రోల్ పరిమితం చేస్తూ బంకు నిర్వాహకులు ఆంక్షలు విధించారు. దీనివల్ల ఆటోలు, కార్ల వినియోగదారులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. రాత్రి పది దాటినా కొన్ని బంకుల్లో రద్దీ తగ్గకపోవడంతో, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం ప్రాంతాల్లో డీజిల్ కోసం రైతులు, వాహనదారులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. రాత్రివేళల్లో సైతం బంకుల వద్ద జనం క్యూ కడుతున్నారు. కర్నూలు, కడప మరియు జమ్మలమడుగు వంటి ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. నిల్వలు ఉన్న బంకులను వెతుక్కుంటూ వాహనదారులు జిల్లాలు దాటాల్సి వస్తోంది. నిల్వలు అయిపోవడంతో చాలా బంకులు మూతపడ్డాయి. వాస్తవానికి ఇంధన ధరల అంతర్జాతీయ హెచ్చుతగ్గుల ప్రభావం సరఫరా గొలుసుపై పడిందని, కంపెనీలు సరఫరాను తగ్గించడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని తెలుస్తోంది. అయితే, పౌరసరఫరాల శాఖ మాత్రం సరఫరా మెరుగుపరిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెబుతోంది. ఏదేమైనా, సాధారణ ప్రజలు మాత్రం తమ పనులన్నీ మానుకుని, వాహనాల్లో ఇంధనం కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ సంక్షోభంపై చర్చించేందుకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ నేతృత్వంలో చమురు కంపెనీల ప్రతినిధులు, పెట్రోల్ డీలర్ల సంఘం నాయకులు మరియు ఉన్నతాధికారులతో అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఇంధన నిల్వలను పునరుద్ధరించే మార్గాలను ఈ సమావేశంలో చర్చించనున్నారు. సరఫరా క్రమబద్ధీకరించడం మరియు ఆందోళన కొనుగోళ్లను తగ్గించడంపై దృష్టి సారించనున్నారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిని నియంత్రించడం, రవాణా వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం. రైతుల సాగు అవసరాలకు ఇంధనం కొరత లేకుండా చూస్తామని, ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం భరోసా ఇస్తోంది. రాబోయే రెండు రోజుల్లో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు అనవసరంగా నిల్వలు చేసుకోవద్దని, బాధ్యతగా వ్యవహరించాలని కోరుతున్నారు.

## దిండి కట్ట మైసమ్మ ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం.. మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు

- ఎమ్మెల్యే వంశీతో కలిసి పాల్గొన్న మంత్రి ఆలయ అభివృద్ధి, మహిళల స్వయం ఉపాధిపై కీలక ప్రకటనలు

**నాగర్‌కర్నూలు, వెలుతురు ఏప్రిల్ 26:**
నాగర్‌కర్నూల్ జిల్లాలోని దిండి కట్ట మైసమ్మ ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే వంశీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆలయ నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాల్లో



భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కట్ట మైసమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలంలో భక్తుల సౌకర్యార్థం దోనర్ల సహకారంతో షెడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కట్ట మైసమ్మ ఆశీర్వాదం



తో ఆలయంలో మరింత అభివృద్ధి పనులు జరగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతుండగా అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. బలహీన వర్గాల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల స్వయం ఉపాధి పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గానికి వెయ్యి మంది మహిళలకు 100 శాతం సబ్సిడీపై కుట్టు యంత్రాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో మంత్రివర్గం దీర్ఘకాలం చర్చించి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించామని తెలిపారు. భవిష్యత్తులో ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని, మహిళల ఉచిత ప్రయాణం ద్వారా ఆర్టీసీని మరింత బలోపేతం చేయనున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## శ్రీనగర్‌లో ఖేలో ఇండియా చింతన్ శివిర్



- క్రీడల్లో భారత్‌ను గ్లోబల్ అగ్రగామిగా తీర్చిదిద్దే దిశగా కీలక నిర్ణయాలు

**శ్రీనగర్ వెలుతురు ఏప్రిల్ 26:**
జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఖేలో ఇండియాచింతన్ శివిర్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ శివిర్‌లో మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో భారత్‌ను గ్లోబల్ స్థాయిలో అగ్రగామిగా నిలపాలని లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్రంరాష్ట్రాల సమన్వయంతో క్రీడల అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలని సంకల్ప పత్రాన్ని విడుదల చేశారు. క్రీడల అభివృద్ధికి కేంద్రం తీసుకునే ప్రతి నిర్ణయానికి తెలంగాణ ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే క్రీడల అభివృద్ధి కోసం ప్రత్యేక పాలసీ అమలు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వానికి వివరించారు.అదేవిధంగా, కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఖేలో ఇండియా కార్యక్రమం కింద తెలంగాణకు మరింత నిధులు కేటాయించాలని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయను మంత్రి వాకిటి శ్రీహరి కోరారు.

## తెలంగాణ సంక్షేమ నమూనా దేశానికి మార్గదర్శి

- చండీగఢ్‌లో చింతన్ శివిర్‌లో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**చండీగఢ్, వెలుతురు ఏప్రిల్ 26:**
సామాజిక న్యాయం, సమగ్ర సంక్షేమం, బలహీన వర్గాల సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చండీగఢ్‌లో ఆదివారం నిర్వహించిన చింతన్ శివిర్-2026 సదస్సులో ఆయన పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సదస్సులో సామాజిక న్యాయం, సంక్షేమ పథకాల సమర్థ అమలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల అభివృద్ధి వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి శ్రీ ఏనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం "సమానత్వం-సాధికారత-స్వాభిమాన జీవితం" లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. సోషల్ వెల్ఫేర్ శాఖను "ఎస్సీ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్"గా పునర్నామకరణం చేయడం దళితుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టికి నిదర్శనమని తెలిపారు.

**విద్యా రంగంలో కీలక నిర్ణయం :**
పోస్ట్ మ్యాట్రిక్ స్కాలర్‌షిప్స్ కింద రూ.574.74 కోట్లు వెచ్చించి 3,39,731 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చినట్లు



తెలిపారు. ప్రీ మ్యాట్రిక్ స్కాలర్‌షిప్స్ ద్వారా రూ.66.31 కోట్లు ఖర్చు చేసి 73,666 మంది విద్యార్థులకు సహాయం అందించారని చెప్పారు. డా. బి.ఆర్. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి కింద రూ.103.49 కోట్లు వెచ్చించి 564 మంది విద్యార్థులకు విదేశీ విద్య అవకాశాలు కల్పించామని వివరించారు. టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్స్ కోసం రూ.24.53 కోట్లు ఖర్చు చేసి 2,426 మంది విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ కోచింగ్ అందిస్తున్నట్లు తెలిపారు.

**వసతి, సంక్షేమం, మహిళా సాధికారత**
ఎస్సీ హాస్టల్స్ నిర్వహణకు రూ.628.42 కోట్లు వెచ్చించి 2,26,950 మంది విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా 47,539 మంది లబ్ధిదారులకు రూ.476.15 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. కులాంతర వివాహాల ప్రోత్సాహకంగా 1,723 జంటలకు రూ.43.06 కోట్లు అందించామని వివరించారు.

**ఆర్థిక సాధికారత – యువతకు అవకాశాలు**
"రాజీవ్ యువ వికాసం" ద్వారా బ్యాంక్ లింక్డ్, నాన్ బ్యాంక్ పథకాల కింద సబ్సిడీలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణల ద్వారా యువతను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

**చట్టపరమైన రక్షణ & చారిత్రాత్మక నిర్ణయాలు**
SCSDF చట్టం కింద డిసెంబర్ 2023 నుంచి రూ.31,763.63 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.40,231.62 కోట్ల కేటాయింపు జరిగిందన్నారు. SC/ST అట్రాసిటీ చట్టాల అమలుకు ప్రత్యేక కోర్టులు, మొబైల్ కోర్టులు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని చెప్పారు. "తెలంగాణ ఎస్సీ రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్స్ యాక్ట్, 2025" అమలు ద్వారా సమాన అవకాశాల కోసం చారిత్రాత్మక అడుగు వేసినట్లు పేర్కొన్నారు.

**విద్యా సంస్థలు – జాతీయ స్థాయిలో గుర్తింపు**
TGSWREIS కింద 268 విద్యాసంస్థల్లో 1,52,701 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. SSCలో 97.71% ఉత్తీర్ణత సాధించి, NEET, JEE లో విశేష ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు.

**డిజిటల్ పాలన & పారదర్శకత**
ERP, ఈఆఫీస్, DBT విధానాల ద్వారా నిధులను నేరుగా లబ్ధిదారులకు చేరవేస్తూ పారదర్శకతను పెంచుతున్నామని తెలిపారు. జియో ట్యాగింగ్, రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా పథకాల అమలు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

**దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమం – సమగ్ర దృష్టి**
దివ్యాంగుల కోసం "చేయూత" పింఛన్ కింద 4.74 లక్షల మందికి నెలకు రూ.4,016 చెల్లిస్తూ సంవత్సరానికి రూ.2,288 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సహాయక పరికరాల పంపిణీ కోసం రూ.50 కోట్లు ఖర్చు చేసి 7,570 మందికి అందించామని చెప్పారు. వృద్ధుల కోసం 16.36 లక్షల మందికి పింఛన్ల రూపంలో సంవత్సరానికి రూ.3,958 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డే కేర్ సెంటర్లు, వృద్ధాశ్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల కోసం 32 "మైత్రి క్లినిక్స్", నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, స్వయం ఉపాధి కోసం సబ్సిడీలు అందిస్తున్నామని వివరించారు.

**మత్తు పదార్థాల నియంత్రణలో చర్యలు**
రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాల ద్వారా 2.47 కోట్ల మందికి చేరువయ్యామని, 36 ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యసన చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

**కేంద్ర-రాష్ట్రాల సమన్వయంపై దృష్టి**
సామాజిక న్యాయం రంగంలో కేంద్రరాష్ట్రాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని మంత్రి సూచించారు. డిజిటల్ విధానాల వినియోగంతో సంక్షేమ పథకాల అమలులో వేగం, పారదర్శకత మరింత బలోపేతం కావలసిన అవసరముందున్నారు. ఈ చింతన్ శివిర్ రాష్ట్రాల మధ్య ఉత్తమ విధానాలు పరస్పరం మార్పిడి, సమన్వయానికి సమర్థ వేదికగా నిలిచిందని మంత్రి అడ్లూరి అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం సంక్షేమాన్ని కేవలం పథకాల అమలుగా కాకుండా — సమాజ మార్పుకు శక్తివంతమైన సాధనంగా భావిస్తూ ప్రతి వర్గానికీ అండగా నిలుస్తోందని మంత్రి స్పష్టం చేశారు ప్రతి పౌరుడు గౌరవంగా జీవించాలి" అనే లక్ష్యంతో రాష్ట్రం ముందుకు సాగుతోందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.

## సైబర్ నేరగాళ్లపై 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2.0' నిఘా : డైరెక్టర్ శిఖా గోయల్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:**
రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసిఎస్బి) సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. గడిచిన రెండేళ్లలో అరెస్టయిన నేరగాళ్లు మళ్లీ నేరాల బాట పట్టకుండా ఉండేలా 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2.0' పేరిట భారీ నిఘా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడించారు. ఏప్రిల్ 25వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రత్యేక తనిఖీలు ప్రారంభమయ్యాయని, శాంతి భద్రతల విభాగం పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఈ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.
ఈ ఆపరేషన్ గురించి శిఖా గోయల్ వివరాలు తెలుపుతూ, సైబర్ నేరాల పట్ల తమది 'జీరో టాలరెన్స్' విధానమని స్పష్టం చేశారు. 202425 కాలంలో తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 3,567 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేయగా, వారిలో రాష్ట్రానికి చెందిన 614 మంది ప్రధాన నిందితులపై ప్రస్తుతం ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఈ తనిఖీల కోసం 300 బృందాలు క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగాయని, నిందితుల ప్రస్తుత నివాసం, వృత్తి, వారి ఆర్థిక లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తున్నాయని వివరించారు. ప్రతి నిందితుడి నివాసాన్ని జియో ట్యాగింగ్ చేయడం ద్వారా వారి కదలికలను నిరంతరం ట్రాక్ చేస్తున్నామని, వారు బెయిల్ నిబంధనలను అతిక్రమించకుండా చూస్తున్నామని ఆమె పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో మ్యూల్ అకౌంట్ హోల్డర్లు (269), ఏజెంట్లు (155), చైల్డ్ సెక్షువల్ అబ్యూస్ మెటీరియల్ (సి ఎస్ ఏ ఎం ) నిందితులు (36), సైబర్ స్లేవరీకి పాల్పడేవారు (8) వంటి వివిధ రకాల నేరగాళ్లు ఉన్నట్లు డైరెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు 335 మందిని భౌతికంగా తనిఖీ చేయగా, వీరికి తెలంగాణలో 480 కేసులు, దేశవ్యాప్తంగా 1,233 కేసులతో సంబంధం




ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరిలో 218 మంది ఆచూకీ లభించగా, 115 మంది పరారీలో ఉన్నారని, ముగ్గురు మరణించారని తెలిపారు. ఈ క్రమంలోనే సీఎస్ఈఏఎం కేసులో నిందితుడైన ప్రసాద్ కుమార్ అనే వ్యక్తి ప్రస్తుతం నేపాల్‌లో ఉన్నట్లు గుర్తించామని, గతంలో అతడు సికింద్రాబాద్‌లోని ఒక రెస్టారెంట్‌లో పని చేసేవాడని ఆమె వివరించారు.
ఒకసారి అరెస్టయిన తర్వాత కూడా నిందితులు పోలీసుల నిఘాలోనే ఉంటారని 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2.0' ద్వారా తెలియజేస్తున్నామని శిఖా గోయల్ పునరుద్ఘాటించారు. ఎవరైనా మళ్లీ నేరాలకు పాల్పడినట్లు తెలిస్తే లేదా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే వారిపై వెంటనే 'సస్పెక్ట్ షీట్లు' తెరిచి, కఠిన నిఘా ఉంచుతామని హెచ్చరించారు. పౌరులను సైబర్ మోసాల నుండి రక్షించేందుకు తెలంగాణ పోలీసులు అన్ని దశల్లోనూ అప్రమత్తంగా ఉన్నారని డైరెక్టర్ శిఖ గోయల్ భరోసా ఇచ్చారు.

## జనగణన స్వీయ నమోదు ప్రారంభం.. మే 10 వరకు పోర్టల్ అందుబాటులో

**వెలుతురు ఏప్రిల్ 26:**
భారత ప్రభుత్వం చేపడుతున్న జనగణన-2027 ప్రక్రియలో భాగంగా ఇండ్ల జాబితా, ఇండ్ల గణనకు సంబంధించిన స్వీయ నమోదు (Self Enumeration) ప్రక్రియ ఈ నెల 26వ తేదీ (ఆదివారం) నుంచి ప్రారంభమైంది. జిల్లా ప్రజలు, అధికారులు బాధ్యతగా ఇందులో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కే. శ్రీనివాస్, డీఆర్ఓ టి.ఎల్. సంగీతలతో కలిసి ఇండ్ల గణనకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా పోర్టల్‌లో తన వివరాలను నమోదు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యావంతులు, ప్రజలందరూ స్వీయ గణనలో పాల్గొనాలని సూచించారు. ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు https://se.census.gov.in పోర్టల్‌లో స్వీయ నమోదు చేసుకోవచ్చని తెలిపారు.
జనగణన-2027ను రెండు దశల్లో నిర్వహిస్తున్న



ట్లు కలెక్టర్ వివరించారు. మొదటి దశలో మే 11 నుంచి జూన్ 9 వరకు ఇండ్ల గణన జరగనుండగా, రెండో దశలో 2027 ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు జనాభా గణన, కుల ణన నిర్వహిస్తారని చెప్పారు. ఇండ్ల గణన కోసం మే 11 నుంచి జూన్ 9 వరకు ఇంటింటికీ వచ్చే నమోదు అధికారులకు అవసరమైన అన్ని వివరాలు అందించాలని సూచించారు. జనగణనకు సంబంధించిన సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని స్పష్టం చేశారు. స్వీయ గణన ద్వారా వివరాలు నమోదు చేయడం వల్ల తప్పులు తగ్గి సమయం ఆదా అవుతుందని తెలిపారు. నమోదు అనంతరం పొందే 'SE ID'ను భద్రపరచుకుని, ఎన్యూమరేటర్ వచ్చినప్పుడు చూపించాలని సూచించారు. స్వీయ గణనలో భాగంగా పౌరులు సెన్సస్ పోర్టల్‌లో మొత్తం 33 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఇళ్ల వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, మౌలిక సదుపాయాలు, ఆస్తులు తదితర అంశాలపై సమాచారం నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు స్వీయ గణనపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ఈ డేటా ఆధారంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని చెప్పారు. మొదటిసారిగా ఈ ప్రక్రియ పూర్తిగా డిజిటల్ రూపంలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఎప్పుడైనా వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే. శ్రీనివాస్, డీఆర్ఓ టి.ఎల్. సంగీత, జిల్లా సెన్సస్ ఇన్‌చార్జి శిరీష, ఎన్నికల/సెన్సస్ విభాగం అధికారి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన దుశర్ల సత్యనారాయణ శరీరం విధ్వంసానికి గురైన అడవిని తలపిస్తోంది

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26:

పర్యావరణవేత్త, నీటి హక్కుల ఉద్యమకారుడు దుశర్ల సత్యనారాయ గారి పై దాడి హేయమైనదని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ గారు అన్నారు. తీవ్రంగా గాయపడి నిమ్స్ హాస్పటిల్ లో చికిత్స పొందుతున్న వారిని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురఖ గారు పరామర్శించారు. వారు దాడికి గురైన నేపథ్యాన్ని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సత్యనారాయణ గారికి అందుతున్న చికిత్స వివరాల పై డాక్టర్లను ఆరా తీశారు.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, గాయపడి నెత్తురొడిన దుశర్ల సత్యనారాయణ గారి శరీరం విధ్వంసానికి గురైన అడవిని తలపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చదనం పెంపు కోసం, నీటి వనరుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిన మహామనిషి దాడి గురికావడమంటే మనిషి ఉనికి దాడికి గురవడమేనని మంత్రి పేర్కొన్నారు.

ఫ్లోరోసిస్ సమస్య నిర్మూలనకు జలసాధన సమితి వ్యవస్థాపకుడిగా సత్యనారాయణ గారు చేసిన పోరాటం ఎంతో గొప్పదని మంత్రి అన్నారు. నల్గొండ నుండి ఢిల్లీ వరకు పాదయాత్రలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి నల్గొండ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ఫ్లోరోసిస్ సమస్య పై జనాల్ని జాగృతం చేశారని అన్నారు. నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి గారి ముందు వంకర్లు పోయిన ఫ్లోరైడ్ బాధితులను పడుకోబెట్టి తెలంగాణ రాష్ట్రంలోని ఫ్లోరైడ్ సమస్య తీవ్రతను దేశానికి చాటిన జలసాధకుడు సత్యనారాయణ అని ప్రశంసించారు. వారి పై దాడికి పాల్పడిన వారిని చట్టపరిధిలో కఠినంగా శిక్షించాలని నల్గొండ ఎస్పీ నరసింహని మంత్రి సురేఖ ఆదేశించారు.

"తెలంగాణలోనే అతిపెద్ద 70 ఎకరాల మానవనిర్మిత అడవిని సృష్టించి ఎన్నో వైవిధ్యభరితమైన వృక్ష, పక్షి, జంతుజాలానికి కేంద్రంగా నిలపిన ప్రకృతి ప్రేమికుడు దుశర్ల సత్యనారాయణ. వారికి ప్రభుత్వం అన్నివేళలా అండగా వుంటుంది. ప్రభుత్వపరంగా ఆయనకు కావాల్సిన సహాయ, సహకారాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుంది" అని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ప్రకృతి శక్తులే సహకరించడం వల్లే సత్యనారాయణ ఈ దాడి నుండి ప్రాణాలతో బయటపడ్డారని మంత్రి సురేఖ తెలిపారు. సత్యనారాయణగారు త్వరగా కోలుకుని వారికి ఎంతో ఇష్టమైన ప్రకృతి పరిరక్షణ పనుల్లో నిమగ్నం కావాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. జీవవైవిధ్యానికి ఆలవాలంగా నిలిచిన సత్యనారాయణ అభివృద్ధి చేసిన 70 ఎకరాల అటవీ క్షేత్రానికి వన మహోత్సవం కార్యక్రమ నిధులతో సంరక్షణ చర్యలు చేపడతామని మంత్రి సురేఖ సత్యనారాయణకు హామీ ఇచ్చారు. ఇందుకు సత్యనారాయణ మంత్రి గారికి కృతజ్ఞతలు తెలిపారు. సత్యనారాయణ గారి స్ఫూర్తితో రాష్ట్ర ప్రజలందరూ ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు.

## అమెరికా అధ్యక్షుడిపై హత్యాయత్నం

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 26: అమెరికా పాలనా కేంద్రం వైట్ హౌస్‌లో శనివారం రాత్రి జరిగిన ప్రెస్ కరస్పాండెంట్ల వార్షిక విందు కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగించాల్సి ఉన్న తరుణంలో గుర్తు తెలియని వ్యక్తి ఒక్కసారిగా కాల్పులు జరపడంతో అక్కడ ఉన్న వారంతా భయాందోళనలకు గురయ్యారు. విందులో అధ్యక్షుడు ట్రంప్ తో పాటు ఫస్ట్ లేడీ మెలానియా, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, రక్షణ మంత్రి పీట్ హెగెత్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో వంటి అత్యున్నత స్థాయి నేతలు పాల్గొన్నారు. వీరితో పాటు దేశంలోని ప్రముఖ జర్నలిస్టులు, సెలబ్రిటీలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం ఉత్సాహంగా సాగుతున్న సమయంలో హఠాత్తుగా 5 నుంచి 8 రౌండ్ల కాల్పుల శబ్దాలు వినిపించడంతో బాంకెట్ హాల్ ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయింది. అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు వెంటనే రంగంలోకి దిగి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని చుట్టుముట్టి అత్యంత సురక్షిత ప్రాంతాలకు తరలించారు. లోపల ఉన్న అతిథులు ప్రాణాలను కాపాడుకోవడానికి టేబుళ్ల కింద తలదాచుకోగా, భద్రతా సిబ్బంది ఆయుధాలతో హాల్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

ఈ ఘటనకు సంబంధించి కాలిఫోర్నియాలోని టోరెన్స్‌కు చెందిన 31 ఏళ్ల కోల్ థామస్ అలెన్‌ను నిందితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన విందు హాల్‌కు బయట ఉన్న ప్రాంతం నుంచి నిందితుడు కాల్పులు జరిపినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దుండగుడు భారీ ఎత్తున ఆయుధాలతో అక్కడికి చేరుకున్నాడని, ఒకవేళ భద్రతా దళాలు వేగంగా స్పందించకపోతే పెను ప్రమాదం సంభవించి ఉండేదని అధికారులు వెల్లడించారు. కాల్పుల సమయంలో అడ్డుగా వెళ్లిన ఒక లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి బుల్లెట్ తగిలింది. అయితే ఆయన ధరించిన బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ కారణంగా తూటా లోపలికి దూసుకెళ్లలేదని, దీంతో ఆయనకు ప్రాణాపాయం తప్పిందని భద్రతా వర్గాలు ధృవీకరించాయి. కాల్పుల అనంతరం నేషనల్ గార్డ్ సిబ్బంది వైట్ హౌస్ పరిసరాల్లో మోహరించి కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. భవనం నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చినప్పటికీ, లోపలికి వచ్చే ప్రవేశాలను తాత్కాలికంగా నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.

## ఆప్ ఎంపీలపై అనర్హతకు డిమాండ్

న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 26:

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నుంచి బీజేపీలో చేరిన ఏడుగురు రాజ్యసభ సభ్యులపై అనర్హత వేటు వేయాలని కోరుతూ ఆ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు అధికారికంగా పిటిషన్ సమర్పించారు. ఫిరాయింపులకు పాల్పడిన సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన కోరారు. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ తన ప్రాథమిక సూత్రాల నుంచి పక్కకు జరిగిందని ఆరోపిస్తూ రాఘవ్ చడ్డా, హర్భజన్ సింగ్, స్వాతి మలివాల్ సహా ఏడుగురు ఎంపీలు గత శుక్రవారం పార్టీని వీడి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టించింది. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం ఒక పార్టీ గుర్తుపై గెలిచిన ప్రతినిధులు మరో పార్టీలో చేరడం రాజ్యాంగ విరుద్ధమని, ఇది ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించడమేనని సంజయ్ సింగ్ విమర్శించారు. ముఖ్యంగా పంజాబ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆరుగురు ఎంపీలు ఈ ద్రోహానికి పాల్పడటం ఆ రాష్ట్ర ప్రజలను వంచించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకునేందుకు అక్రమ మార్గాలను వెతుకుతున్నారని మండిపడ్డారు. బీజేపీలో చేరిన ఎంపీల తరపున రాఘవ్ చడ్డా విలీన వాదనను బలంగా వినిపిస్తున్నారు. రాజ్యసభలో ఆప్ పార్టీకి ఉన్న మొత్తం పది మంది ఎంపీలలో ఏడుగురు అంటే మూడింట రెండు వంతుల మంది సభ్యులు వేరే పార్టీలో చేరారు కాబట్టి, ఇది రాజ్యాంగం ప్రకారం విలీనం కిందికే వస్తుందని ఆయన వాదిస్తున్నారు. పార్టీ మారిన వారిలో అశోక్ మిత్తల్, సందీప్ పాఠక్, రాజేంద్ర గుప్త, విక్రమ్ సాహ్ని వంటి కీలక నేతలు కూడా ఉన్నారు. అయితే ఈ విలీన వాదన చెల్లదని సంజయ్ సింగ్ తోసిపుచ్చారు. రాజ్యసభ మాజీ సెక్రటరీ జనరల్ మరియు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వంటి రాజ్యాంగ నిపుణులను సంప్రదించామని, ఫిరాయించిన వారు ఖచ్చితంగా అనర్హతకు గురవుతారని వారు స్పష్టం చేశారని పేర్కొన్నారు. పార్టీ గుర్తుపై గెలిచిన వారు స్వచ్ఛందంగా పార్టీని వీడినప్పుడు ఆటోమేటిక్ గా సభ్యత్వం రద్దు కావాలని ఆప్ కోరుతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం పంజాబ్ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో పంజాబ్ రాష్ట్రవ్యాప్తంగా ఫిరాయింపు ఎంపీలకు నిరసన సెగలు తగులుతున్నాయి. మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ జలంధర్ నివాసం ఎదుట ఆప్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. రాజ్యసభ సభ్యత్వం ఇచ్చి గౌరవిస్తే పార్టీకి ద్రోహం చేస్తారా అంటూ నినాదాలు చేశారు. మరోవైపు పంజాబ్ ఎమ్మెల్యేలు కూడా బీజేపీ వైపు చూస్తున్నారనే ప్రచారాన్ని సంజయ్ సింగ్ తీవ్రంగా ఖండించారు. ఇదంతా బీజేపీ మరియు ఫిరాయింపు ఎంపీలు సృష్టిస్తున్న కట్టుకథ అని కొట్టిపారేశారు. పంజాబ్‌లో ప్రస్తుతం వీరికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, తమ సభ్యత్వం రద్దు కానుందని తెలిసి కూడా ఏ ఎమ్మెల్యే వారి వెంట వెళ్లే సాహసం చేయరని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు అసత్య ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పార్టీ ఫిరాయించిన వారిపై ప్రజలే రోడ్లపైకి వచ్చి బుద్ధి చెబుతున్నారని, త్వరలోనే న్యాయస్థానాల్లో కూడా వారికి చుక్కెదురు తప్పదని హెచ్చరించారు.

# అంబేద్కర్ స్మృతి స్థల్ కు 2 గజాల జాగా కూడా కాంగ్రెస్ ఇవ్వలే

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ స్థానంలోకి రావాలని తాపత్రయపడుతున్న రేవంత్ రెడ్డి ఆ కుట్రలో భాగంగా ఇలాంటి ప్రతిపాదనలు తీసుకొస్తున్నారని తెలిపారు. జీడీపీ ఆధారంగా సీట్లు పెంపు అర్ధరహితమని , రేవంత్ రెడ్డి పిచ్చి ప్రతిపాదనలను చూసి కాంగ్రెస్ నేతలే తిట్టుకుంటున్నారని అన్నారు. ఆదివారం రోజున హైదరాబాద్ లోని సోమాజీగూడ జయ గార్డెన్స్ లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బండి సంజయ్ తోపాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, బంగారు శ్రుతి, రాథోడ్ తదితరులు హజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే.... అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్. ఆయన జీవిత చరిత్రను అట్టడుగు స్థాయిలో తీసుకెళ్లాలనే ఉద్దేశంతో సదస్సులు, సమావేశాల పేరుతో ఇంటింటికీ తీసుకెళుతున్న చరిత్ర మోదీదే. బీజేపీదే. అతి పేదరికంలో పుట్టి అనేక ఇబ్బందులు పడి వెనుకంజ వేయకుండా కసితో లక్ష్యసాధనవైపు సాగిన వ్యక్తి అంబేద్కర్. ఒక్కపూట భోజనం చేసి వీధిలైట్ల కింద చదువుకున్నారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లేందుకు సాయం చేయాలని బరోడా మహారాజును కోరితే తన వద్ద 10 ఏళ్లే పనిచేయాలని షరతు విధిస్తే ... సరేనని అంగీకరించి విదేశాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించి ఇచ్చిన మాట కోసం బరోడా మహారాజు వద్ద పనిచేసిన మాట తప్పని మహనీయుడు అంబేద్కర్. ఈరోజు భారతదేశంలో ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశంగా ఫరిఢవిల్లుతుందంటే దానికి కారణం అంబేద్కర్ అందించిన రాజ్యాంగమే. ఛాయ్ అమ్ముకునే వ్యక్తి ఈరోజు ప్రధాని అయ్యారంటే... అంబేద్కర్ రాజ్యాంగ చలువే. నా ప్రధాని పదవి అంబేద్కర్ పెట్టిన భిక్షేనని వినమ్రంగా చెప్పడమే కాకుండా అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను ఇంటింటికీ తీసుకెళ్లేందుకు క్రుషి చేస్తున్న మహానాయకుడు అంబేద్కర్. దేశం కోసం పనిచేయాలనే లక్ష్యాన్ని ఎంచుకుని ఎన్ని ఇబ్బందులు, అవమానాలు వచ్చినా అధిగమిస్తూ ముందుకు సాగిన గొప్ప వ్యక్తి అంబేద్కర్.



అంబేద్కర్ ను కాంగ్రెస్ అడుగడుగునా అవమానించింది. అంటరాని వాడని, డబ్బులేని వాడని కొందరు అవమానిస్తే అంతకు మించి కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ ను అడుగడుగునా అవమానించింది. అంబేద్కర్ చరిత్రను తెరమరుగు చేసేందుకు కుట్ర చేసింది. స్వాతంత్ర్యం అనంతరం మహాత్మాగాంధీ విజ్ఞప్తి మేరకు నెహ్రూ కేబినెట్ లో చేరిన కాంగ్రెసేతర నాయకులు అంబేద్కర్, శ్యామా ప్రసాద్ ముఖర్జీ. జమ్ము కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ను అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించారు. అంబేద్కర్ లా మినిస్టర్ గా ఉన్నా సరైన గౌరవం ఇవ్వకుండా నెహ్రూ ప్రభుత్వం 370 ఆర్టికల్ తీసుకొచ్చారు. స్వాతంత్రానికి పూర్వం హిందువులకు వేర్వేరుగా అనేక వ్యక్తిగత చట్టాలుండేవి. వాటిని ఒకే చట్టంగా మార్చేందుకు 1951లో హిందూకోడ్ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో మహిళలకు సమాన ఆస్తి హక్కులు, కుటుంబ ఆస్తిలో సమాన భాగస్వామ్యం ఉండాలని ప్రతిపాదించారు. ఒకే వ్యక్తికి ఒకే భార్య ఉండాలని, మహిళలకూ విడాకులు తీసుకునే హక్కు ఉండాలని, వివాహ బంధాన్ని చట్టపరమైన ఒప్పందంగా ఉండాదలని, పిల్లలపై తల్లి హక్కులను గుర్తించాలని, మహిళలకు రిజర్వేషన్లు ఉండాలని ప్రతిపాదించారు. వాటిని పక్కకుపెట్టి నెహ్రూ అంబేద్కర్ ను అవమానించారు. తీవ్ర మనస్థాపంతో అంబేద్కర్ కేంద్ర న్యాయ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి బయటకు వచ్చారు. ఆ తరువాత 1952లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అంబేద్కర్ ఎంపీగా పోటీ చేస్తే.... ఆయనను పార్లమెంట్ లో అడుగుపెట్టనీయకూడదనే లక్ష్యంతో ఆయనకు వ్యతిరేకంగా నెహ్రూ ప్రచారం చేశారు. కమ్యూనిస్టులతో చేతులు కలిపి అంబేద్కర్ ను ఓడించేందుకు కుట్ర చేశారు. 1954 ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా అంబేద్కర్ నిలబడితే ఆయనను ఓడించడానికి కాంగ్రెస్ స్వయంగా అభ్యర్థిని నిలబెట్టింది.

చరిత్రలో అంబేద్కర్ ప్రాధాన్యత తగ్గించేందుకు కాంగ్రెస్ అనేక ప్రయత్నాలు చేసింది. అంబేద్కర్ చనిపోతే ఢిల్లీలో ఆయన అంత్యక్రియలు నిర్వహించడానికి 2 గజాల జాగా కూడా కేటాయించలేదు (పీవీని కూడా ఇలాఈనే అవమానించారు). చేసేదేమీలేక అంబేద్కర్ పార్థివ దేహాన్ని ముంబై తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. అంబేద్కర్ మృతదేహాన్ని పంపిన విమాన చార్జీలను చెల్లించాల్సిందిగా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం వారి భార్యకు బిల్లులను పంపించింది.

ఆశ్చర్యకరమైన విషయం ఏందంటే... 1955లో నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడే తనకు తానుగా సిఫారసు చేసుకుని దేశ అత్యున్నతమైన భారతరత్న అవార్డు అందుకున్నారు. 1971లో ఇందిరాగాంధీ సైతం అదే సాంప్రదాయాన్ని కొనసాగించింది. రాజీవ్ గాంధీసహా కాంగ్రెస్ లో ఉన్న ప్రముఖ నాయకులకు భారతరత్న అవార్డులిచ్చారు. కానీ అంబేద్కర్ కు కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం భారతరత్న ఇవ్వలేదు. ఇంకా బాధాకరమేందంటే...అంబేద్కర్‌ను ఓడించిన అభ్యర్థి ఎన్.ఎస్. కజ్రోల్కర్‌కు 1970లో కాంగ్రెస్ ప్రభుత్వం పద్మభూషణ్ ప్రదానం చేసింది. పార్లమెంట్ సెంట్రల్ హాల్లో అంబేద్కర్ చిత్రపటాన్ని ఉంచేందుకు కూడా కాంగ్రెస్ ప్రాధాన్యం ఇవ్వలేదు. అంబేద్కర్ ఆశయాలను, ఆలోచనలను, సిద్ధాంతాలను అమలు చేస్తున్న ఏకైక జాతీయ పార్టీ ఏదైనా ఉందంటే.... అది బీజేపీ మాత్రమే. నెహ్రూ ఏకపక్ష విధానాలను ప్రశ్నించిన అంబేద్కర్ ను పార్లమెంట్ లో అడుగుపెట్టకుండా రెండుసార్లు కాంగ్రెస్ ఓడిస్తే జన సంఘ్ పార్టీ అంబేద్కర్ ను బెంగాల్ లో ఎమ్మెల్సీగా చేసింది. బీజేపీ మద్దతుతోనే నాటి వీ.పి.సింగ్ ప్రభుత్వం ఏర్పడగానే 1990లో అంబేద్కర్ కు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది. పార్లమెంట్ లో అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసింది. అంబేద్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14న ఎన్డీయే ప్రభుత్వం ''రాష్ట్రీయ సమరసత దినంగా'' నిర్వహిస్తోంది.

2014లో మోదీగారు ప్రధాని పగ్గాలు చేపట్టి పార్లమెంట్ లో అడుగుపెట్టిన వెంటనే అంబేద్కర్ విగ్రహానికి ప్రణమిల్లి 'చాయ్ వాలాకు ప్రధాని పదవి దక్కిందంటే...అది అంబేద్కర్ పెట్టిన భిక్షే'అని చెప్పారు. అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలే బీజేపీ విధానమని చెప్పిన నాయకుడు మోదీగారు. అంబేద్కర్ నడయాడిన జన్మభూమి, శిక్షాభూమి, దీక్షాభూమి, మహాపరినిర్వాణ్, చైతన్య భూమి పేరుతో పంచ తీర్థాలుగా ప్రకటించి ఆయన గొప్పతనాన్ని భావితరాలకు చాటిచెబుతున్నారు. అంబేద్కర్ స్మారక స్టాంపు, బిల్లుల విడుదల చేయడమే కాకుండా 120 దేశాల్లో అంబేద్కర్ జయంతి రోజున సామాజిక న్యాయం, సమరసత వేడుకలు నిర్వహించారు. జాతీయ బీసీ కమిషన్ కు జాతీయ హోదా కల్పించారు.

అంబేద్కర్ ఆలోచనల్లో భాగంగా అణగారిన వర్గాలను ఆర్ధికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో.... బ్యాంకు ముఖమే చూడని 52 కోట్ల మంది పేదలకు జన్ ధన్ ఖాతాలను తెరిపించిన నేరుగా సంక్షేమ పథకాల నగదులో భాగంగా ఇప్పటి వరకు దాదాపు 50 లక్షల కోట్ల రూపాయలను జమ. PMAY ద్వారా 4 కోట్ల ఇండ్లను నిర్మించాం. మరో 3 కోట్ల ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం. 81 కోట్ల మందికి ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా ఉచితంగా రేషన్ బియ్యం. 15 కోట్ల గ్రామీణ కుటుంబాలకు 'హర్ ఘర్ జల్ యోజన' ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు. 12 కోట్ల మందికి స్వచ్ఛ భారత్ టాయిలెట్ల నిర్మాణం. ప్రధానమంత్రి సురక్షా భీమా యోజన ద్వారా 51 కోట్ల మందికి బీమా సౌకర్యం. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన కింద 23 కోట్ల 64 లక్షల మంది లబ్ధి. ఆయుష్మాన్ భారత్ పథకం కింద 77 కోట్ల మందికి 5 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం. 70 లక్షల మంది వీధి వ్యాపారులకు ష్యూరిటీ లేకుండా రుణాలు. 55 లక్షల మందికి ముద్రా రుణాలు. స్టాండప్ ఇండియా కింద ఎస్సీ, ఎస్టీలకు 15 వేల కోట్లను మంజూరు చేసి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాం. కోవిడ్ లాక్ డౌన్ సమయంలో 20 కోట్ల మంది మహిళలకు నేరుగా అర్ధిక ప్రయోజనం. 10 కోట్ల 33 లక్షల కుటుంబాలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు. సౌభాగ్య యోజన కింద మారుమూల ప్రాంతంతోసహా దేశంలో 100 శాతం విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాం. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద దాదాపు 4 లక్షల కోట్ల రూపాయలను 11 కోట్ల మంది రైతుల ఖాతాల జమ చేశారు కాంగ్రెస్ ముమ్మాటికీ మహిళా ద్రోహి. పార్లమెంట్ సాక్షిగా ఇండీ కూటమి పేరుతో బిల్లును అడ్డుకుని మహిళలకు తీరని నష్టం చేశారు. కుటుంబ వారసత్వ పార్టీల మహిళలకే పదవులు కావాలని కాంగ్రెస్ కూటమి భావిస్తోంది. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కూడా ఇచ్చేందుకు వెనుకాడని పార్టీ బీజేపీ. ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచాలన్నది బీజేపీ నిర్ణయం. తద్వారా కొత్త తరానికి మరిన్ని అవకాశాలు కల్పించాలన్నదే మోదీ లక్ష్యం. జీడీపీ ఆధారంగా సీట్ల పెంపు ప్రతిపాదన అర్ధరహితం.రేవంత్ ప్రతిపాదనవల్ల హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే 70 శాతం సీట్లు చేయాలి. కొడంగల్ అసెంబ్లీ స్థానమే ఉండదు. ములుగు, కొమరం భీం జిల్లాలకు ఒక్క సీటు వచ్చే అవకాశం లేదు. రాహుల్ గాంధీ స్థానాన్ని ఆక్రమించాలని రేవంత్ రెడ్డి ప్లాన్ చేస్తున్నారు. రాహుల్ గాంధీకి తెలివి లేదు. అందుకే రేవంత్ రెడ్డి ట్రాప్ లో పడుతున్నారు. డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవడంతో రాహుల్, రేవంత్ లను కాంగ్రెస్ నేతలే తిడుతున్నారు.

# అనవసర కొనుగోళ్లు వద్దు

- ఇంధన కొనుగోళ్లపై సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- ముంబై నుంచి అధికారులతో సీఎం టెలీకాన్ఫరెన్స్
- రాష్ట్రవ్యాప్తంగా 421 పెట్రోల్ బంకులు మూత
- బంకుల్లో రద్దీ పెరగడంతో నిల్వలు ఖాళీ
- సాధారణం కంటే 50 శాతం అదనంగా విక్రయాలు
- ఆక్వా రైతులకు డీజిల్ సరఫరాపై అధికారులకు ఆదేశం
- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడి
- వినియోగదారుల ఆందోళనతో బంకుల వద్ద క్యూలు
- వరి కోత యంత్రాలు, ఏరియేటర్ల కోసం రైతులకు ప్రాధాన్యత
- నిర్విరామంగా ఆయిల్ డిపోల పర్యవేక్షణ.. పోలీసులతో సమన్వయానికి ఆదేశం



ఆంధ్రప్రదేశ్ వెలుతురు ఏప్రిల్ 26:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరత మరియు బంకుల మూసివేత అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ముంబై పర్యటనలో ఉన్న సీఎం, ఆదివారం ఉదయం అమరావతికి బయలుదేరే ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ మరియు ఇతర అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రాష్ట్రంలో ఇంధన లభ్యత మరియు జిల్లావ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులపై అధికారులను ఆరా తీశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4,510 పెట్రోల్ బంకులు ఉండగా, సరఫరాలో తలెత్తిన జాప్యం మరియు అనూహ్యంగా పెరిగిన డిమాండ్ కారణంగా 421 బంకులు మూతపడ్డాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇంధన సరఫరా గతంతో పోలిస్తే 10 శాతం పెరిగినప్పటికీ, కొరత వస్తుందనే భయంతో వినియోగదారులు 'ప్యానిక్ బయింగ్' (ఆందోళనతో కొనుగోళ్లు) చేయడమే ప్రస్తుత రద్దీకి ప్రధాన కారణమని అధికారులు విశ్లేషించారు. సాధారణ రోజుల్లో విక్రయించే పరిమాణం కంటే ఒక్కసారిగా 50 శాతం డిమాండ్ పెరగడంతో బంకుల్లో స్టాక్ త్వరగా అయిపోతోందని, దీనివల్ల వాహనదారులు బారులు తీరాల్సి వస్తోందని ముఖ్యమంత్రికి నివేదించారు.రాష్ట్రవ్యాప్తంగా ఇంధన విక్రయాల గణాంకాలను పరిశీలిస్తే పరిస్థితి తీవ్రత అర్థమవుతోంది. సాధారణంగా ప్రతిరోజు 6,330 కిలో లీటర్ల పెట్రోల్, 9,048 కిలో లీటర్ల డీజిల్ అమ్ముడవుతుండగా, శనివారం నాటికి ఈ సంఖ్య 10,345 కిలో లీటర్ల పెట్రోల్ మరియు 14,156 కిలో లీటర్ల డీజిల్ కు చేరుకుంది. ఈ అదనపు కొనుగోళ్ల ఒత్తిడి సరఫరా గొలుసుపై ప్రభావం చూపుతోందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆక్వా రంగం మరియు వ్యవసాయ పనుల కోసం రైతులు డ్రమ్ముల్లో డీజిల్ కొనుగోలు చేస్తుండటంతో చిల్లర వర్తకంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆక్వా రైతులకు, వరి కోత యంత్రాలకు అవసరమైన ఇంధనాన్ని అందించేలా కలెక్టర్లు మరియు మత్స్య శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సాయంత్రం లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి కోరారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

మరోవైపు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జాయింట్ కలెక్టర్లు మరియు ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కు ఎటువంటి లోటు లేదని, కేవలం సరఫరాలో తలెత్తిన చిన్నపాటి లోపాల వల్లే కొన్ని బంకులు మూతపడ్డాయని ఆయన స్పష్టం చేశారు. ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, వాహనదారులు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కొందరు వ్యాపారులు ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తున్నారని, అటువంటి వారిపై మరియు బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ డిపోల్లో నిరంతరం తనిఖీలు చేపట్టాలని, ప్రైవేటు కంపెనీల అవుట్‌లెట్‌లనూ నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు. బంకుల వద్ద రద్దీ పెరిగి గొడవలు జరగకుండా పోలీస్ యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలోని ప్రధాన నగరాలు మరియు గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ప్రారంభమైన ఇంధన సమస్య ఆదివారం నాటికి మరింత ముదిరింది. చాలా చోట్ల బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టాక్ అందుబాటులో ఉన్న చోట కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతోంది. రైతులు తమ సాగు పనుల కోసం డీజిల్ డబ్బాలతో బంకుల వద్ద నిరీక్షిస్తున్నారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో ఇంధనాన్ని తీసుకెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న సత్వర చర్యల వల్ల రాబోయే 24 గంటల్లో సరఫరా సాధారణ స్థితికి వస్తుందని యంత్రాంగం ఆశిస్తోంది. ప్రజలకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాల ద్వారా వివరించాలని, తప్పుడు సమాచారం వల్ల గందరగోళం తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచనలు అందాయి. అన్ని ఆయిల్ కంపెనీలు తమ సరఫరా సామర్థ్యాన్ని పెంచేలా ప్రభుత్వం ఒత్తిడి తీసుకువస్తోంది.


భారతరాష్ట్ర సమితికి అండగా ఉంటున్న
పార్టీ శ్రేణులకు, ప్రజలకు
భారతరాష్ట్ర సమితి
ఆవిర్భావ దినోత్సవ
శుభాకాంక్షలు
కర్నె ప్రభాకర్ - మాజీ శాసన మండలి సభ్యులు మరియు ప్రభుత్వ విప్
/ karne_prabhakar / karne_brs


Happy Birthday
NRR
బీజేపీ తెలంగాణ రాష్ట్ర రథసారథి
శ్రీ ఎన్. రాంచందర్ రావు గారికి
హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు
పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్
భారతీయ జనతాపార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు